నేటి కందం-నేటికి అందం

రక్షణ అకాడమీ లో
శిక్షణతో భారతమును సేవించుటకై
దక్షతతో విధులందున
తక్షణమే చేరినట్టి తరుణుల దలతున్ !!

(భారత రక్షణ అకాడమీలో శిక్షణ పొందిన మహిళలు రక్షణ అధికారిణులుగా విధులలో చేరడంతో భారత రక్షణ రంగంలో నూతన శకం ప్రారంభమైందని అందరూ శ్లాఘిస్తున్నారు.)

-రాధశ్రీ

సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ఉప్పొంగే యువత
ఉద్యమ ఆవేశం
అణచివేస్తే ఎప్పుడైనా
అగ్నికణం ఈ దేశం.
దేశద్రోహ కుట్ర కాదు
దేహీ అని అడుగలేదు
హక్కుగా భవిష్యత్తును
అడుగుట ఏ తప్పుకాదు

-వేల్పుల నారాయణ

9440433475

చురక



హైదరాబాద్ మంగళవారం 16-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:240 పేజీలు:6 వెల: రూ.1/-


# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం..

## స్వాగతించిన ప్రధాని మోదీ..

న్యూఢిల్లీ, జూన్ 15:అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనడమే కాకుండా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా ద్వారా ప్రధాని మోదీ స్పందించారు

'గత కొద్ది నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల వల్ల అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. అమెరి కా-ఇరాన్ మధ్య కుదిరిన అవగా హన ఒప్పందం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించి, శాశ్వత పరిష్కారానికి దోహదం డుతుంది. సుస్థిరమైన తుది ఒప్పందం కుదిరేలా.. మిగిలిన అంశాలపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం' అని మోదీ పేర్కొన్నారు

ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేలా శాంతి ఒప్పందం ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు ఈ ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు యుద్ధ చర్యలను నిలిపివేసి, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మార్గాన్ని తిరిగి తెరవడానికి అంగీకరించాయి. దీనివల్ల అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ధరలు తగ్గుముఖం పట్టాయి.

# డ్రోన్లు, మిస్సైళ్లతో భారీ అటాక్




న్యూఢిల్లీ, జూన్ 15: ఉక్రెయిన్‌పై రష్యా మళ్లీ విరుచుకుపడింది. తాజా దాడుల్లో మొత్తం 9 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని కీవ్‌తో పాటు ఖార్కీవ్, ఇతర కీలక నగరాలు లక్ష్యంగా భారీ స్థాయిలో డ్రోన్లు, క్షిపణి దాడులు జరిగాయి.

కీవ్‌లో 11వ శతాబ్దానికి చెందిన డార్మిషియన్ కేథడ్రల్‌పై దాడి జరగడంతో చర్చిలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీవ్‌లో నలుగురు మృతి చెందగా, ఖార్కీవ్‌లో మంటలను ఆర్పేందుకు వెళ్లిన ఐదుగురు రెస్క్యూ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ ప్రధాని యులియా సిరిడెంకో ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇది దేశ ప్రజలు, వారసత్వంపై క్రూరమైన దాడిగా అభివర్ణించారు.

మరోవైపు, ఉక్రెయిన్ డ్రోన్ దాడుల్లో రష్యాలోని మాస్కో సమీపంలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. రష్యా డ్రోన్, మిస్సైల్ దాడుల వల్ల అనేక భవనాలు, వాహనాలు దగ్ధమయ్యాయి. సుమారు 14 వేల మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం.

రష్యా రక్షణ శాఖ ప్రకారం, ఉక్రెయిన్‌లోని మూడు ప్రధాన నగరాల్లో మిలిటరీ పరిశ్రమ కేంద్రాలు, ఎయిర్‌ఫీల్డ్‌లపై లాంగ్ రేంజ్ దాడులు నిర్వహించామని వెల్లడించింది. ఆకాశం, భూమి, సముద్ర మార్గాల నుంచి డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించామని తెలిపింది.

ఉక్రెయిన్ మాత్రం రష్యా ప్రయోగించిన 70 క్షిపణులు, 600కు పైగా డ్రోన్లను అడ్డుకున్నామని పేర్కొంది. చర్చిపై దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణలను రష్యా ఖండిస్తూ, పేట్రియాట్ మిస్సైల్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని పేర్కొంది.

# ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం



హైదరాబాద్, జూన్ 15: తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర , ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు.

# తెలంగాణలో భారీ వర్షాలు.. అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 15: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు.

విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# మెట్రో ప్రాజెక్టును అడ్డుకుంటోంది కిషన్ రెడ్డే: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 15: హైదరాబాద్‌ను విశ్వనగరం అని చెప్పుకుంటున్నామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లా డుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా సౌకర్యం ఉండాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే మెట్రో పనులు ప్రారంభమయ్యాయని.. రూ. 15వేల కోట్లతో పనులను ప్రారంభించినట్లు చెప్పారు. కేసీఆర్ వచ్చాక మెట్రో నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. 2014 - 17 మధ్య మెట్రో పనులు పూర్తిగా ఆగిపోయాయని, కేసీఆర్ సాకులు చెప్పి మెట్రో పనులను మూడేళ్లు ఆలస్యం చేశారని మండిప డ్డారు. రూ. 7వేల కోట్ల అంచ నాలు పెరిగేలా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మెట్రో విస్తరణపై దృష్టి పెట్టామని వెల్లడించారు.

ప్రజల అవసరాలకు తగ్గట్లు మెట్రో నిర్మాణం జరగలేదని సీఎం అన్నారు. మెట్రో సెకండ్ ఫేజ్ కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని.. 122కి.మీ. మెట్రో విస్తరణకు L&T తిరస్కరించిం దన్నారు. ఒకప్పుడు ఢిల్లీ, హైదరాబాద్ మెట్రోలు అగ్రస్థా నంలో ఉండేవన్నారు. సొంత ఆస్తులు పెంచుకోవాలనే గత పాలకులు ఆలోచించారని.. కేసీఆర్ తీరు వల్లే మెట్రో విస్తరణ ఆలస్యమైందని ఆరోపించారు. తొలిదశ మెట్రోతోనే నష్టాలు వస్తున్నాయని L&T చెప్పిందన్నారు. ఏటా రూ. 400కోట్లకు పైగా నష్టం వస్తోందని L&T చెప్పినట్లు తెలిపారు. మెట్రో రెండో దశలో భాగస్వామ్యానికి L&Tనిరాకరించిందని.. L&T నుంచి మెట్రో కొంటేనే సమస్య తీరుతుందని కేంద్రం చెప్పిందన్నారు. రూ. 30వేల కోట్ల మెట్రోను రూ. 15వేల కోట్లకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం మెట్రో నిర్మాణానికి కి.మీ.కు రూ. 350కోట్లు ఖర్చవుతుందని సీఎం పేర్కొన్నారు.

IRFC రుణం బదిలీ ప్రక్రియకు అంతా సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు. రూ. 84కోట్ల డాక్యు మెంట్ ఫీజు కూడా చెల్లించామన్నారు. ఈక్విటీ కింద రూ. 1,400 కోట్లు జమచేశామన్నారు. రూ. 13,400 కోట్లకు 4శాతం వడ్డీకి 20ఏళ్లకు ఒప్పించామని వివరించారు. మే 21న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కిషన్‌రెడ్డి కలిసి అడ్డుపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ ఉండాలా.. వద్దా.. అని ఒత్తిడి చేశారని.. కిషన్‌రెడ్డి వల్లే రుణం బదిలీ ఆగిపోయిందం టూ మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్టును కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా.. లేదా.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 15: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా.. అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ. 15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా.. లేదా.. అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ. 40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తావే భరిస్తామని.. NOC ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు

### మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..

రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం NOC అయినా ఇప్పించరా.. అని నిలదీశారు. నిధులు ఇప్పించి NOC ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# వచ్చే ఏడాది నుంచి పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: బ్రిటన్ ప్రధాని

న్యూ ఢిల్లీ, జూన్ 15: సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి పిల్లలను కాపాడేందుకు యూకే ప్రభుత్వం నడుం కట్టింది. వచ్చే ఏడాది నుంచి యూకేలో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా నిషేధం విధిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తాజాగా తెలిపారు. ఈ ఏడాది చివరి కల్లా ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అమల్లోకి తెస్తామని అన్నారు. ఆన్‌లైన్ ప్రపంచం తాలూకు చెడు ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడుకునేందుకు గట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'పూర్తిస్థాయి నిషేధమే సబబని నాకు అనిపిస్తోంది. దీన్ని అమలు చేయడం చాలా కష్టం. కానీ టెక్ కంపెనీ ఒత్తిడిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే' అని ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనల పూర్తిస్థాయి అమలుకు తాను సిద్ధమేనని పేర్కొన్నారు. పిల్లల భద్రత, ఆనందం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పిల్లలకు ఆన్‌లైన్ ప్రపంచం నుంచి రక్షణ కల్పించడమే ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబాల పక్షాన నిలవాల్సిన సమయం ఇదేనని అభిప్రాయపడ్డారు. యథాతథ స్థితితో ఎలాంటి ప్రయోజనం కలగట్లేదని తాము గుర్తించినట్టు చెప్పారు.

ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఈ తరహా నిషేధం అమలవుతోంది. సోషల్ మీడియాపై ఆంక్షలకు ఇండోనేషియా కూడా సిద్ధమైంది. పిల్లల సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బ్రెజిల్‌లో ఇప్పటికే పలు రకాల ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పిల్లలకు సోషల్ మీడియా నిషేధానికి ఫ్రాన్స్ కూడా సిద్ధమైంది. తుర్కియే చర్యలు తుదిదశలో ఉన్నాయి. ఇతర పాశ్చాత్య దేశాలు కూడా ఇదే బాటలో అడుగులు వేస్తున్నాయి. అయితే, తాను తీసుకునే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని బ్రిటన్ ప్రధాని చెప్పారు.

# భూపాలపల్లి సింగరేణి గనిలో పేలిన మందుగుండు.. తప్పిన ప్రమాదం



జయశంకర్ భూపాలపల్లి, జూన్ 15: జిల్లాలోని సింగరేణి సంస్థకు చెందిన కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీకే) 5వ గనిలో సోమవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గని లోపల బొగ్గు ఉత్పత్తి పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తుండగా ఊహించని విధంగా మందుగుండు చేతిలోనే పేలిపోయింది. ఈ ఘటనలో శ్రీరాముల ప్రదీప్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు.

గని అంతర్భాగంలోని 13వ లెవెల్‌లో బొగ్గును వెలికితీసేందుకు మందుపాతరలు అమర్చి బ్లాస్టింగ్ ప్రక్రియను చేపట్టారు. అయితే, ఆ సమయంలో మందుగుండు హఠాత్తుగా చేతిలోనే పేలడంతో ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉన్న తోటి కార్మికులు అప్రమత్తమై, తీవ్ర రక్తస్రావంతో ఉన్న ప్రదీప్‌ను.. భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న సింగరేణి ఉన్నతాధికారులు.. గని వద్దకు చేరుకుని సమగ్ర విచారణను ప్రారంభించారు.

# ప్రభుత్వ ఆస్పత్రులు, స్కూళ్లు వద్దనే భావనను తొలగించేలా కసరత్తు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 15: తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. ఈరోజు(సోమవారం) ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు మంచి బ్రేక్‌ఫాస్ట్ పాలు, రాగి జావాను అందిస్తున్నామని.. దాదాపు రూ. 800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.

విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ. 800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

# కుటుంబాలకు ఊపిరిగా వలసదారుల చెల్లింపులు

## (16 జూన్ "అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం" సందర్భంగా)

మన తెలుగు రాష్ట్రాల్లో ఎందరో కార్మిక శ్రామిక వర్గాలు అప్పుల భారాన్ని తగ్గించుకోవడ్నికి, తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవడానికి, తమ స్వగ్రామంలో ఇల్లు కట్టుకోవడానికి దుబాయ్, సౌథీ అరేబియా లాంటి దేశాలకు కన్నీటి ధారలతో వలస వెళ్లడం చూస్తున్నాం. అదే విధంగా ఉన్నత విద్యార్హతలను కలిగిన యువత ఉన్నత ఉద్యోగాల వేటలో విదేశాలకు వలస వెళ్లడం కూడా జరుగుతుంది. ఇలాంటి వలసదారులు తాము కష్టపడి సంపాదించిన ధనాన్ని తమ ఊళ్లల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులకు పంపడం ద్వారా ఆయా కుటుంబాల్లో ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల విద్య, గృహ నిర్మాణాలు, అప్పులు తీర్చడం, కుటుంబ సమగ్రాభివృద్ధి జరగడం లాంటివి తరుచుగా చూస్తున్నాం. ఇలా విదేశాల్లో లేదా స్వదేశంలో ఇతర ప్రాంతాలకు జీవనోపాధులను వెతుక్కుంటూ వలసలు వెళ్లిన అభాగ్యుల శ్రమ తమ కుటుంబాలకు ఆశా దీపాలుగా పని చేస్తున్నాయి.

### అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం-2026 ఇతివృత్తం:

వలసలు వెళ్లి సంపాదించిన డబ్బును తమ స్వంత ఊళ్లల్లో ఉన్న కుటుంబాలకు పంపించంతో ఆయా కుటుంబాలు ఆనంద ఆయురారోగ్యాలతో గడపడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట జూన్ 16న "అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం" లేదా "ఇంటర్నెషనల్ ఫ్యామిలీ రెమిటెన్సెస్ డే"ను ఘనంగా జరుగుపుకోవడం గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్నది. ఈ దినోత్సవ వేదికగా వలసదారుల శ్రమను గుర్తించడం, వారికి ప్రభుత్వ చేయూతను ఇవ్వడం, వలసదారుల యోగక్షేమాలను చూసుకోవడం, ఆర్థిక ప్రగతిలో వారి పాత్రను అవగాహన పర్చడం లాంటివి జరగాలి. 2026 అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం ఇతివృత్తంగా "చెల్లింపులు జీవనాధారం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

వలసదారులు తమ స్వదేశీ కుటుంబాలకు పంపించే చిన్న మొత్తం డబ్బులను పంపినప్పటికీ ఆ మొత్తం ఆయా కుటుంబాలు మెరుగైన జీవితాలను గడపడానికి ఉపకరిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో దాదాపు 5 ట్రిలియన్ డాలర్ల వలసదారుల చెల్లింపులు తమ కుటుంబాలకు చేరడం గమనించారు. 2030 నాటి ఈ చెల్లింపులు అదనంగా దాదాపు 4.4 ట్రిలియన్లు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

### ఒక బిలియన్ వలసదారులు - 500 బిలియన్ల చెల్లింపులు:

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ వలసదారులు 500 బిలియన్ డాలర్ల సంపాదనను తమ కుటుంబాలకు పంపించడం, ఆ కుటుంబాల్లో పేదరికం తగ్గుతూ, వారి జీవన ప్రమాణాలు పెరగడం జరుగుతోందని గమనించారు. ఈ వలసదారుల్లో 2.58 బిలియన్ల అంతర్జాతీయ వలసదారులు, 760 మిలియన్ల స్వదేశీ వలసదారులు ఉన్నారు. వలసదారులు పంపించే డబ్బు అధికంగా గ్రామీణ కుటుంబాల ఉన్నతికి ఉపయోగపడుతున్నాయి. మెక్సికో, చైనా, ఇండియా లాంటి దేశాల్లో వలసదారులు తమ కుటుంబాలకు పంపిస్తున్న చెల్లింపులు అధికంగా ఉన్నాయని తెలుస్తున్నది. వలసదారులు పంపించే ధనంతో దాదాపు 800 మిలియన్ల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతున్నారు. పిల్లల విద్య, పేదరిక నిర్మూలన, కుటుంబ ఆరోగ్యం, పోషకాహారం, గృహ నిర్మాణాలు, కుటుంబాలకు నిలకడ రావడం, అప్పులు తీరడం, అవకాశాలు మెరుగుపడడం, గ్రామీణ అభివృద్ధికి ఊతం ఇవ్వడం ఆర్థిక అసమానతలు తగ్గడం దీర్ఘకాలిక ప్రయోజనాలు కలగడం, కుటుంబ ఆర్థిక స్థితులు బలపడడానికి ఉపయోగపడుతూ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి.

తమ కుటుంబాలను, స్వగ్రామాలను, పిల్లల్ని వదిలి పొట్ట చేత పట్టుకొని విదేశాలకు లేదా తమ దేశంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఆభాగ్యులు ఒంటి పూట తింటూ, అనారోగ్యకర వాతావరణంలో సహితం జీవిస్తూ, తమ పిల్లల బంగారు భవితను స్వప్నిస్తూ, సంపాదించిన ధనాన్ని తమ స్వదేశంలో ఉన్న కుటుంబాలకు పంపించడా ద్వారా దేశాభివృద్ధిలో ఎంతగానో దోహదపడుతున్నారని గమనిస్తూ, వారి సేవలను కొనియాడుదాం, వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటూ సహకరిద్దాం.



-మధుపాళీ
9949700037

# వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ ఆవిష్కరణలు, రైతు సంక్షేమమే లక్ష్యంగా బ్రిక్స్ వ్యవసాయ ఒప్పందం

న్యూ ఢిల్లీ, జూన్ 15: ఇండోర్‌లో జరిగిన బ్రిక్స్ వ్యవసాయ మంత్రుల సమావేశం శుక్రవారం నాడు ముగిసింది. 'ఇండోర్ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించటంతో ప్రపంచ వ్యవసాయ సహకారంలో కీలక ఘట్టంగా ఈ సమావేశం నిలిచింది. ఆహార భద్రత, రైతుల సంక్షేమం, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయం, వ్యవసాయ వాణిజ్యం, డిజిటల్ వ్యవసాయాన్ని బలోపేతం చేయటమే లక్ష్యంగా ఈ ప్రకటన పలు కీలక నిర్ణయాలను వివరిస్తుంది. విలేకరుల సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సంక్షోభాలు, అనిశ్చితులు నెలకొన్న సమయంలో బ్రిక్స్ సమావేశం ప్రపంచానికి ఆశ, విశ్వాసం, ఉమ్మడి బాధ్యత సందేశాన్ని పంపిందని అన్నారు.

### సమావేశ విస్తృతి, శక్తి, ప్రాధాన్యత

కేంద్రమంత్రులు శ్రీ రామ్ నాథ్ ఠాకూర్, శ్రీ భగీరథ్ చౌదరి, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియాతో మాట్లాడుతూ... బ్రిక్స్ వ్యవసాయ కార్యవర్గానికి సంబంధించిన ఉన్నతాధికారుల సమావేశం, మంత్రుల స్థాయి సమావేశం విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి సుమారు 60 మంది విదేశీ ప్రతినిధులతో సహా దాదాపు 100 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయం, ఆహార భద్రతకు సంబంధించిన సమస్యలను బ్రిక్స్ దేశాలు ఎంత బాధ్యతగా, తీవ్రంగా పరిగణిస్తున్నాయో ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల వాటా దాదాపు సగం ఉందని, ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమిలో సుమారు 42 శాతం ఈ దేశాల్లోనే ఉందని, ప్రపంచ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దాదాపు 42 శాతం వాటాను ఇవి అందిస్తున్నాయని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఫలితంగా ప్రపంచ వేదికపై బ్రిక్స్ సమష్టి స్వరం అద్భుతమైన శక్తిగా ఆవిర్భవించింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రస్తుతం బ్రిక్స్ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టటం పట్ల, ఇండోర్‌లో అధికారిక స్థాయి, మంత్రిత్వ స్థాయి వ్యవసాయ సమావేశాలు నిర్వహించటం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

నాలుగు ప్రధాన ప్రాధాన్యతలపై చర్చ నాలుగు కీలక ప్రాధాన్యతలపై విస్తృత చర్చలు జరిగినట్లు కేంద్రమంత్రి తెలిపారు:

బ్రిక్స్ దేశాలు, ప్రపంచానికి ఆహార భద్రత, పోషకాహార భద్రత. బ్రిక్స్ దేశాల మధ్య వ్యవసాయ వాణిజ్యం, సహకారాన్ని పెంపొందించటం. వాతావరణ మార్పులకు అనుగుణంగా పునరుత్పాదక, వాతావరణ మార్పులను తట్టుకోగల, సుస్థిర వ్యవసాయ పద్ధతులు. ఆహార వ్యవస్థలు, వ్యవసాయ రంగాల్లో ఆవిష్కరణలు, సాంకేతికత, భాగస్వామ్యాలను బలోపేతం చేయటం.

సమృద్ధిగా ఆహార లభ్యత ఉండేలా చూడటం, పోషకాహార ఫలితాలను మెరుగుపరచటం, ప్రపంచానికి అన్నం పెట్టే రైతుల జీవనోపాధిని సురక్షితం చేయటం వంటివి చర్చల ప్రధానాంశాలని ఆయన స్పష్టం చేశారు. పలు దేశాల్లో కుటుంబ రైతులుగా పిలవబడే చిన్న, సన్నకారు రైతుల కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వారి సవాళ్లు, వ్యవసాయ ఉత్పాదకాల లభ్యత, రుణ లభ్యత, లాభదాయకమైన ధరలు, మార్కెట్ అనుసంధానాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు.

### ఇండోర్ ప్రకటన: రైతు-కేంద్రంగా ప్రపంచ నిబద్ధత

విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ ఉమ్మడి ప్రకటనను ఏకగ్రీవంగా ఆమోదించామని, ఇకపై దీన్ని "ఇండోర్ డిక్లరేషన్"గా పిలుస్తారని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. రైతులే కేంద్రంగా ఈ ప్రకటన ఉందని... ఆహార భద్రత, పోషణ, జీవనోపాధి, వ్యవసాయ వాణిజ్యం, ఆవిష్కరణలు, పెట్టుబడులు, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సుస్థిర వ్యవసాయాభివృద్ధి వంటి రంగాల్లో పురోగతికి బ్రిక్స్ దేశాల ఉమ్మడి నిబద్ధతను ఇది తెలియజేస్తుందని పేర్కొన్నారు. "వ్యవసాయం ద్వారా సురక్షితమైన, మరింత సుసంపన్నమైన, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించాలనే బ్రిక్స్ దేశాల సమష్టి సంకల్పానికి, ఉమ్మడి బాధ్యతకు, నిబద్ధతకు ఈ ప్రకటన ప్రతీక" అని ఆయన అన్నారు. ఈ ప్రకటనలో పేర్కొన్న కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా, రైతులకు, గ్రామీణ సమాజాలకు, ఆహార వ్యవస్థలకు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా సభ్య దేశాలు సమష్టిగా, నిరంతరం పనిచేయటానికి అంగీకరించినట్లు తెలిపారు.

### ప్రకటించిన నాలుగు నూతన సంస్థాగత కార్యక్రమాలు

వ్యవసాయ-పర్యావరణ శాస్త్రం, పునరుత్పాదక వ్యవసాయంపై బ్రిక్స్ ప్రతిభా కేంద్రాల వ్యవస్థ

వ్యవసాయ-పర్యావరణ శాస్త్రం, పునరుత్పాదక వ్యవసాయంపై బ్రిక్స్ ప్రతిభా కేంద్రాల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. సహజ, సేంద్రియ, పునరుత్పాదక వ్యవసాయ రంగాల్లో ఉమ్మడి పరిశోధన, జ్ఞాన భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. సభ్య దేశాలు ఒకరి ఉత్తమ పద్ధతుల నుంచి మరొకరు నేర్చుకోవటానికి, వాతావరణ మార్పులను తట్టుకోగల, సుస్థిరమైన వ్యవసాయ వ్యవస్థలను ప్రోత్సహించటానికి ఇది వీలు కల్పిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, రసాయన ఎరువుల సమతుల్య వినియోగానికి భారత్ దీర్ఘకాలంగా ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తుచేస్తూ... బ్రిక్స్ దేశాలు సమష్టిగా ఈ విధానాల ప్రాముఖ్యతను గుర్తించాయని శ్రీ శివరాజ్ చౌహాన్ తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా భారతదేశ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మోదీపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మింగ్ సిస్టమ్స్ రీసెర్చ్ కీలక పాత్ర పోషిస్తుందని.. ఉమ్మడి పరిశోధనలు, జ్ఞాన భాగస్వామ్యం, శిక్షణకు సహకారాన్ని అందిస్తుందని వెల్లడించారు.

### డిజిటల్ వ్యవసాయంపై బ్రిక్స్ వ్యవస్థ

ప్రకటించిన రెండో ప్రధాన కార్యక్రమం... డిజిటల్ వ్యవసాయంపై బ్రిక్స్ వ్యవస్థ. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికతలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా ఆధారిత వ్యవసాయ పరిష్కారాల్లో సహకారాన్ని ఈ వ్యవస్థ బలోపేతం చేస్తుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ కార్యక్రమం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వ్యవసాయ ఆవిష్కరణల మధ్య వారధిగా పనిచేస్తుందని, తద్వారా సాంకేతిక పురోగతి నేరుగా రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. ఈ వ్యవస్థను ఐఏటీ ఢిల్లీ సమన్వయం చేస్తుండగా డిజిటల్ వ్యవసాయంలో ఉమ్మడి పురోగతిని సాధించేందుకు సభ్య దేశాలన్నీ ఆవిష్కరణలు, అనుభవాలు, విధానపరమైన నిర్ణయాలను పంచుకోవటం ద్వారా సహకారాన్ని అందిస్తాయి.

### విత్తన వ్యవస్థల్లో రైతుల హక్కులపై ప్రపంచ వేదిక

మూడో ప్రధాన ప్రకటనగా విత్తన వ్యవస్థల్లో రైతుల హక్కులపై ప్రపంచ వేదిక ఏర్పాటును కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. విత్తనాలకు సంబంధించి రైతుల హక్కులను రక్షించడం, స్థానిక (దేశవాళీ) విత్తన వైవిధ్యాన్ని కాపాడటం, సంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను పరిరక్షించడంపై ఈ వేదిక ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ వంటి దేశాలకు వందలాది, వేలాది సంవత్సరాల వ్యవసాయ సంప్రదాయాలు ఉన్నాయని, అయితే జీవవైవిధ్యం, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలిచే అనేక సాంప్రదాయ విత్తన రకాలు ప్రస్తుతం అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "కొత్త, హైబ్రిడ్ వంగడాలు ఎంత అవసరమో, దేశవాళీ విత్తనాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం" అని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులు, ఆహార భద్రత నేపథ్యంలో సాంప్రదాయ విత్తనాల ప్రాధాన్యతను గుర్తిస్తూ... వాటి పరిరక్షణ, నిరంతర లభ్యతను నిర్ధారించడానికి, రైతుల సంప్రదాయ జ్ఞానాన్ని కాపాడటానికి ఈ వేదిక కృషి చేస్తుందని తెలిపారు.

### బ్రిక్స్ అగ్రిన్-వ్యవసాయ ఉత్పాదకాలు, జన్యు వనరులు, సమాచార వ్యవస్థ

నాల్గవ కార్యక్రమంగా బ్రిక్స్ అగ్రిన్ ఏర్పాటును ప్రకటించారు. (వ్యవసాయ ఉత్పాదకాలు, జన్యు వనరులు, సమాచార వ్యవస్థలు). వ్యవసాయ ఉత్పాదకాలు, విత్తనాలు, జన్యు వనరుల్లో సభ్య దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ఈ వేదిక ముఖ్య ఉద్దేశ్యం. వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న ఉత్తమ వంగడాలు, జన్యు వనరులు, మేలైన పద్ధతులను మరింత సమర్థవంతంగా పంచుకునేందుకు వీలుగా సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం, సామర్థ్య పెంపొందింపు, భాగస్వామ్యాలను ఈ వ్యవస్థ సులభతరం చేస్తుందని శ్రీ చౌహాన్ చెప్పారు. ఇటువంటి వనరులు, సమాచారం అందుబాటులో లేని దేశాలకు, రైతులకు ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### ప్రస్తుత వేదికల బలోపేతం

ప్రస్తుతం ఉన్న బ్రిక్స్ వ్యవసాయ పరిశోధన వేదికను మరింత బలోపేతం చేసి, దానిని ఒక శక్తిమంతమైన 'నాలెడ్జ్-టు-యాక్షన్ హబ్' (పరిజ్ఞానాన్ని ఆచరణలోకి తెచ్చే కేంద్రం)గా అభివృద్ధి చేయడానికి బ్రిక్స్ దేశాలు అంగీకరించాయని కేంద్ర మంత్రి తెలిపారు. పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, త్వరితగతిన రైతుల పొలాల్లోకి చేరాలని ఆయన చెప్పారు. "పరిమిత వర్గాలకే పరిమితం కాకుండా ఆవిష్కరణలను విస్తరించడం, కొత్త సాంకేతికతలు, పరిష్కారాలు ఎక్కువ సంఖ్యలో దేశాలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా చూడటమే మా లక్ష్యం. ఇదే 'ల్యాబ్ టు ల్యాండ్' (ప్రయోగశాల నుంచి పొలానికి) విధానం నిజమైన స్ఫూర్తి" అని ఆయన అన్నారు.

### వ్యవసాయ వాణిజ్యంపై ప్రత్యేక దృష్టి

న్యాయమైన, సమానమైన, సమగ్రమైన, పారదర్శకమైన బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థకు తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ దేశాలు పునరుద్ఘాటించినట్లు శ్రీ చౌహాన్ తెలిపారు. భారత్ నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ద్వారా బ్రిక్స్ ధాన్యం మార్పిడి వంటి ప్రతిపాదనలపై చర్చలు పుంజుకున్నాయని ఆయన చెప్పారు.

సభ్య దేశాల మధ్య జరిగిన పలు ద్వైపాక్షిక సమావేశాలలో వ్యవసాయ వాణిజ్యాన్ని సులభతరం చేయ డం, కస్టమ్స్, ఇతర అడ్డంకులను తగ్గించడం, పరిశోధన సహకారాన్ని పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు.

### వాతావరణ మార్పులు, ఎల్ నినో, కార్బన్ క్రెడిట్స్, ఆహార నష్టం

వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న ముప్పును ప్రస్తావిస్తూ... భూమి కేవలం ప్రస్తుత తరానికే కాదు, భవిష్యత్తు తరాలకు కూడా చెందుతుందని, అందుకే పునరుత్పాదక, వాతావరణ మార్పులను తట్టుకునే, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన ఉమ్మడి బాధ్యత అందరిపై ఉందని శ్రీ చౌహాన్ అన్నారు. ఎల్ నినో ప్రభావంపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ.. దీని ప్రభావం భారత్‌తో పాటు పలు ఆసియా-పసిఫిక్ దేశాలపై పడే అవకాశం ఉందన్నారు. అయితే దేశాలన్నీ దీనిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయని, ఇటువంటి సవాళ్లను అధిగమించడానికి ఉమ్మడి వ్యూహాలు, సమాచార మార్పిడి యంత్రాంగాలపై చర్చలు జరిగాయని చెప్పారు. కార్బన్ క్రెడిట్ల గురించి మాట్లాడుతూ... దీని కోసం ఇప్పటికే ఒక వ్యవస్థ అందుబాటులో ఉందని, నిర్దేశిత విధానాలను అనుసరించే రైతులు కార్బన్ క్రెడిట్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. వాతావరణాన్ని రక్షించే విధానాలు, పునరుత్పాదక వ్యవసాయం ఈ దిశగా ఆచరణాత్మక మార్గాలను చూపుతాయన్నారు. ఆహార నష్టంపై జరిగిన సాంకేతిక చర్చలను ప్రస్తావిస్తూ... పంట కోతల తర్వాతి నష్టాలను తగ్గించడం, కర్బన ఉద్గారాలకు కారణమవుతున్న ఆహార వృథాను అరికట్టే మార్గాలను సభ్య దేశాలు పరిశీలించాయని శ్రీ చౌహాన్ వివరించారు.

నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సాంకేతికతను అలవర్చు కోవడంలో యువత అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నారని, బ్రిక్స్ దేశాలు తమ అనుభవాలు, విధానపరమైన కార్యక్రమాల ద్వారా ఈ ధోరణిని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇండోర్ నగరం అందించిన ఆతిథ్యాన్ని కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. మాల్వా ప్రాంతం చూపిన ఆదరణ, సాంప్రదాయ ఆతిథ్యానికి విదేశీ ప్రతినిధులు ఎంతగానో ముగ్ధులయ్యారని పేర్కొన్నారు. ఇండోర్‌లోని ఛప్పన్ దుకాన్, రాజ్వాడ, మాండూ ప్రాంతాల సందర్శన విదేశీ ప్రతినిధులకు ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్'ప్రచారంలో భాగంగా బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు ఇండోర్‌లోని మేఘదూత్ గార్డెన్‌లో మొక్కలు నాటి, అక్కడ 'బ్రిక్స్ వాటిక'ను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో గ్లోబల్ పార్క్, యూరో-రష్యన్ పార్కులను కూడా ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఈ సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన మధ్య ప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, వారి బృందంతో పాటు... కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ, విదేశాంగ, పశుసంవర్ధక, మత్స్య శాఖ, వాణిజ్య, ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖలు, నీతి ఆయోగ్ అందించిన సహకారాన్ని శ్రీ చౌహాన్ అభినందించారు.

# ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తే సహించం

## -ప్రతి అర్హుడి ఓటును కాపాడటం బీఎల్ఏల బాధ్యత: ఉషశ్రీ చరణ్




అమరావతి, జూన్ 15:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డం పెట్టుకుని అధికార పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ఓటర్ల హక్కులను కాపాడటం ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) ప్రధాన బాధ్యత అని ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు.

పెనుకొండ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయిలో బీఎల్ఏలు చేపట్టాల్సిన బాధ్యతలు, ఓటర్ల జాబితా పరిశీలన విధానం, సవరణ ప్రక్రియలో పాటించాల్సిన అంశాలపై నాయకులు సమగ్రంగా వివరించారు.

ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును కాపాడేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే చర్యలు ఎక్కడైనా జరిగితే వాటిని క్షేత్రస్థాయిలోనే గుర్తించి అడ్డుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం, అనర్హుల పేర్లు చేర్చడం, మ్యాపింగ్ ప్రక్రియలో పొరపాట్లు లేదా అక్రమాలు జరగకుండా ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఉషశ్రీ చరణ్ విమర్శించారు. ప్రజల ఓటు హక్కును హరించే ఏ ప్రయత్నాన్నైనా ప్రజల సహకారంతో తిప్పికొడతామని పేర్కొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఏలకు ఇఖీటూ, ఔూఖ వినియోగం, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాలు, తొలగింపులకు సంబంధించిన ఫారం-7, వివరాల సవరణకు సంబంధించిన ఫారం-8 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సెల్ఫ్ మ్యాపింగ్, ప్రాక్సీ మ్యాపింగ్, ఓటర్ల ధృవీకరణ, అభ్యంతరాల నమోదు ప్రక్రియలపై వివరించారు.

ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిరంతరం పరిశీలిస్తూ ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా తొలగిపోకుండా చూడాలని ఉషశ్రీ చరణ్ బీఎల్ఏలకు సూచించారు.

ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై పార్టీ ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తుందని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆమె తెలిపారు.

# కంటి ఆరోగ్యంలో రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

## -శంకర నేత్రాలయ ద్వారా అత్యున్నత కంటి సంరక్షణ సేవలు-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, జూన్ 15:పేదల కంటి ఆరోగ్య పరిరక్షణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని.. శంకర నేత్రాలయ సహకారంతో రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలు, చికిత్స సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ.. శంకర నేత్రాలయ (మొబైల్ ఐ సర్జికల్ యూనిట్), సి.రత్నమాంబ, డీవీఎస్ మూర్తిల జ్ఞాపకార్థం డా. అపర్ణ, డా. మాధవ్ దుర్బా సహకారంతో సోమవారం ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటిపొర చికిత్స శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు.




ఈ నెల 21వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరంలో కంటిపొర పరీక్షల సేవలు అందుబాటులో ఉంటాయని, ఈ నెల 18 నుంచి 22 వరకు శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. కంటి శుక్లం ఉన్నవారికి ఈ శిబిరంలోనే శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని వివరించారు. శస్త్రచికిత్స జరిగిన వారికి ఐవోఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. సేవలు అవసరమైన వారు 944 00 29999, 93930 9737 3 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చునాన్నరు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించడంలో రెడ్‌క్రాస్, శంకర నేత్రాలయ కీలక పాౖ

# అగ్రోబయోడైవర్సిటీ నిపుణుల కమిటీని పునర్వ్యవస్థీకరించిన జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ: ఛైర్మన్‌గా నియమితులైన పద్మశ్రీ డాక్టర్ పీఎల్ గౌతమ్

న్యూఢిల్లీ, జూన్ 15: జీవవైవిధ్య చట్టం-2002లోని సెక్షన్ 13(1) ప్రకారం ఆగ్రోబయోడైవర్సిటీ నిపుణుల కమిటీని జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) ఏడాది కాలానికి పునర్వ్యవస్థీకరించింది. వ్యవసాయ జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిర వినియోగం, సౌలభ్యం- ప్రయోజనాల పంపిణీ (ఏబీఎస్) సంబంధిత అంశాలపై ఈ కమిటీ మార్గదర్శకత్వం అందిస్తుంది.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థకూ, వృక్షజాతుల పరిరక్షణ, రైతు హక్కుల సంస్థ (పీపీవీఎఫ్ఆర్ఏ)కూ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన పద్మశ్రీ డాక్టర్ పీఎల్ గౌతమ్ పునర్వ్యవస్థీకరించిన కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వ్యవసాయ శాస్త్రంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇటీవలే డాక్టర్ గౌతమ్ పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. పీపీవీఎఫ్ఆర్ఏ ఛైర్‌పర్సన్ ఈ కమిటీకి సహ ఛైర్మన్‌గా ఉంటారు.

2005 నుంచి ఎన్‌బీఏకు వ్యవసాయ జీవవైవిధ్య నిపుణుల కమిటీ ముఖ్యమైన సలహా సంఘంగా ఉంది. వ్యవసాయ జన్యు వనరులకు సంబంధించి కొత్తగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కమిటీని కాలానుగుణంగా పునర్వ్యవస్థీకరిస్తున్నారు. అనేక ఏళ్లుగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు ఈ సంఘానికి సారథ్యం వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వ్యవసాయ, పరిశోధన, విద్యా, విధాన సంస్థలకు చెందిన విశిష్ట ప్రతినిధులు దీనిలో భాగంగా ఉన్నారు.

వ్యవసాయ జీవవైవిధ్యానికి సంబంధించిన అనేక అంశాలపై నిపుణుల సిఫార్సులను అందించడం ద్వారా జీవవైవిధ్య చట్టం అమలులో ఈ కమిటీ కీలక పాత్ర పోషించింది. దీనిలో ఆహారం, వ్యవసాయానికి సంబంధించి మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందం (ఐటీపీజీఆర్ఎఫ్ఏ)కు సంబంధించిన అంశాలు, వివిధ రకాల పంటల విత్తనాలు, పాడి పశువుల పిండాల ఎగుమతులకు సంబంధించి ఎదురవుతున్న సౌలభ్యం -ప్రయోజనాల పంపిణీ సమస్యలు, సంప్రదాయ మొక్కల ప్రజననానికి సంబంధించిన స్పష్టతలు, జీవవైవిధ్య చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం జీవ వనరులకు సంబంధించిన భాగస్వామ్య పరిశోధన ప్రాజెక్టులకు సంబంధిత మంత్రిత్వ శాఖ జారీ చేసిన అనుమతుల నమూనా లాంటి అంశాలున్నాయి.

వ్యవసాయ పరిశోధన, ఆవిష్కరణ, జీవ వనరుల సుస్థిర వినియోగంతో జీవవైవిధ్య పరిరక్షణ లక్ష్యాలను సమతౌల్యం చేయడంలో కమిటీ సిఫార్సులు గణనీయమైన సహకారాన్ని అందించాయి.

వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, మొక్కలు, పశువులు, చేపల జన్యు వనరులకు సంబంధించిన జాతీయ బ్యూరోలు, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, జాతీయ ఆవిష్కరణ ఫౌండేషన్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం, ఇతర కీలక పరిశోధన, విద్యా సంస్థలకు చెందిన విశిష్ట నిపుణులు, సీనియర్ ప్రతినిధులు ఈ పునర్వ్యవస్థీకరించిన కమిటీలో ఉన్నారు.

వ్యవసాయ రంగంలో జీవవైవిధ్య పరిశీలనలను ఏకీకృతం చేయడంలోనూ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలోనూ ఎన్‌బీఏకు ఈ కమిటీ సూచనలిస్తుంది.

జీవవైవిధ్య చట్టం ప్రకారం విత్తన రంగానికి సంబంధించిన సమస్యలను పరిశీలిస్తుంది. జీవ వనరులకు సంబంధించిన అంతర్జాతీయ భాగస్వామ్య పరిశోధనల మార్గ దర్శకాలను సమీక్షిస్తుంది. అంతరించిపోతున్న దేశీయ పంటల రకాలు, జంతువుల పరిరక్షణ, సుస్థిర వినియోగానికి సంబంధించిన చర్యలను సిఫార్సు చేస్తుంది. ఐటీపీజీఆర్ఎఫ్ఏతో సహా వ్యవసాయ జీవవైవిధ్యానికి సంబంధించి అంతర్జాతీయ ఒప్పందాల్లో భారత్ పోషించే పాత్రకు మద్దతు ఇచ్చేలా సాంకేతికపరమైన, విధానపరమైన సలహాలను కూడా కమిటీ అందిస్తుంది.

వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలోనూ, జన్యు వనరులు, వాటికి సంబంధించిన సంప్రదాయ విజ్ఞానాన్ని సంరక్షించడంలోనూ, సుస్థిరమైన, వాతావరణ మార్పులను తట్టుకోగలిగిన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలోనూ భారత ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ఆగ్రో బయోడైవర్సిటీ నిపుణుల కమిటీ పునర్వ్యవస్థీకరణ ప్రతిబింబిస్తుంది.

వ్యవసాయ జన్యు వనరులను, దేశీయ వంగడాలను, జంతు రకాలను పరిరక్షించడం, సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నవీకరించిన ఎన్‌బీఎస్ఏపీలోని 4, 13 లక్ష్యాలను సాధించడంలోనూ, ఎస్‌డీజీ 2( ఆకలి రహితం), ఎస్‌డీజీ 13 (వాతావరణ చర్య), ఎస్‌డీజీ 15 (భూమిపై జీవం) సాకారం చేయడంలోనూ కమిటీ భారత్‌కు సహకరిస్తుంది.

# రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభం

## -రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: విజయ భాస్కర్



అమరావతి, జూన్ 15: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉరవకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ భాస్కర్ పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు.

ఉరవకొండ పట్టణంలోని వ్యవసాయ డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవినేని పురుషోత్తం, బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ, ఉరవకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తనాల పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేలిముద్రలు నమోదు చేసి, నిర్ణీత మొత్తాన్ని చెల్లించిన రైతులకు విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కే-6, టీసీజీఎస్-1694 రకాల వేరుశనగ విత్తనాలకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని చెప్పారు.

ఒక్క సంచి (30 కిలోలు) అర్థ ఎకరాకు, రెండు సంచులు (60 కిలోలు) ఒక ఎకరానికి సరిపోతాయని వివరించారు. కే-6 రకం 1,800 క్వింటాళ్లు, టీసీజీఎస్-1694 రకం 100 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి రకం 100 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి ధర్మకర్తల మండలి చైర్మన్ రేగటి నాగరాజు, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, మాజీ సర్పంచ్ ఓబులేసు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కండక్టర్ తిమ్మప్ప, సూరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా యోగాంధ్ర పోటీలు..

## ఈ నెల 16వ తేదీ వరకు జిల్లాస్థాయిలో నిర్వహణ

## జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని

విజయవాడ, జూన్ 15: యోగాంధ్ర-2026లో భాగంగా యోగా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయని.. ఇప్పటికే ప్రారంభమైన జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని ఐవీ పేలస్‌లో సోమవారం జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయని.. యోగా అండ్ యూత్ బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో ఈ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. గ్రామ, మండల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలైన 30 మంది సోమవారం నాటి పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు జరుగుతున్నాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉన్నాయన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు.






# భారత సైన్యాధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం... జూన్ 30న బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, జూన్ 15:సైనిక దళాల ప్రస్తుత ఉప అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్, పీవీఎస్ఎం, యూవైఎస్ఎం, ఏవీఎస్ఎంని తదుపరి సైన్యాధిపతిగా భారత ప్రభుత్వం నియమించింది. జూన్ 30, 2026న మధ్యాహ్నం ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది, పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం అదే రోజున పదవీ విరమణ చేయనున్నారు.

లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్.. ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. డిసెంబర్ 1986లో సాయుధ దళంలో నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన సైనిక వృత్తిలో కార్యాచరణ, వ్యూహాత్మక, సామర్థ్య అభివృద్ధి, సంస్థాగత రంగాల్లో ఆయనకు విస్తృతమైన అనుభవం ఉంది. భారత సైన్య సామర్థ్యాన్ని పెంచటంలో, దీర్ఘకాలిక పరివర్తనలో ఆయన పాత్ర కీలకమైనది.

జనరల్ ఆఫీసర్ విభిన్న కార్యాచరణ వాతావరణాల్లో ప్రతి స్థాయిలో కమాండర్‌గా పనిచేశారు. కమాండర్ బాధ్యతల్లో ఎడారి సెక్టార్‌లోని సాయుధ రెజిమెంట్, పశ్చిమ ప్రాంతంలోని సాయుధ బ్రిగేడ్, జమ్మూకాశ్మీర్‌లోని కౌంటర్ ఇన్సర్జెన్సీ ఫోర్స్ ఉన్నాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా పదోన్నతి పొందిన తర్వాత భారత సైన్యంలోని ప్రధాన దాడి విభాగమైన సుదర్శన్ చక్ర దళానికి కమాండర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా పనిచేస్తూ.. కీలకమైన జాతీయ, అంతర్జాతీయ సైనిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఉత్సవ బాధ్యతలను పర్యవేక్షించారు.

సైనిక దళాల ఆధునీకరణకు చేసిన కృషికి మంచి గుర్తింపు పొందారు. ఆర్మీ ప్రధాన కార్యాలయంలోని వ్యూహాత్మక ప్రణాళిక, సామర్థ్యాల అభివృద్ధి విభాగాల్లో కీలకమైన బాధ్యతలను నిర్వహించారు. సైన్యం ఆధునీకరణ, సామర్థ్య ప్రణాళిక, దీర్ఘకాలిక బలగాల నిర్మాణ కార్యక్రమాలను రూపొందించారు. భవిష్యత్తులో యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఆర్మీ అవసరాలకు అనుగుణంగా అనుసంధానించటంలో ఆయన సేవలు దోహదపడ్డాయి.

లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ గొప్ప సైనికాధికారి. వృత్తిపరమైన సైనిక విద్యా, శిక్షణా కోర్సుల్లో ఎప్పుడూ అగ్రస్థానంలో నిలుస్తూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. హయ్యర్ కమాండ్ కోర్సు, నేషనల్ డిఫెన్స్ కాలేజీలో ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. పారిన్‌లో ప్రతిష్ఠాత్మకమైన కమాండ్, స్టాఫ్ కోర్సుకు హాజరయ్యారు. ఇది ఆయనకున్న విస్తృత వ్యూహాత్మక దృక్పథాన్ని, ఆధునిక సైనిక వ్యవహారాలపై అవగాహనను ప్రతిబింబిస్తుంది.

# భారత తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో... బంగారం అక్రమ రవాణా ముఠాల ఆటకట్టించిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 15:వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కోల్‌కతా, అగర్తలాలో పూర్తి సమన్వయంతో నిర్వహించిన భారీ ఆపరేషన్ ద్వారా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సుమారు 17 కిలోల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారుగా రూ. 25 కోట్లు. ఈ కేసుతో సంబంధం ఉన్న 10 మందిని అరెస్టు చేశారు. 12.06.26న కోల్‌కతా విమానాశ్రయం ద్వారా థాయి లాండ్ నుంచి 11.6 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించే దుకు ప్రయత్నిస్తున్న ఒక స్మగ్లింగ్ ముఠాను డీఆర్ఐ పట్టుకుంది.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత తంగిరాల ప్రభాకరరావు

## -ఎంపీ, ఎమ్మెల్యే, మాజీమంత్రి

## -ఘనంగా తంగిరాల ప్రభాకరరావు కాంస్య విగ్రహావిష్కరణ



అమరావతి, జూన్ 15:పేదరికం నుంచి అంచలంచలుగా ఎదిగి, రాజకీయ రంగంలో తన సేవలతో ప్రజల హృదయాలను గెల్చుకున్న మహానేత దివంగత తంగిరాల ప్రభాకరరావు అని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి దేవినేని ఉమా కొనియాడారు. తంగిరాల ప్రభాకరరావు 12వ వర్ధంతి సందర్భంగా మండలంలోని కంచికచర్ల, కీసర గ్రామాలలో దివంగత తంగిరాల ప్రభాకరరావు కాంస్య విగ్రహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ సౌమ్య, ఉమా లతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, మాజీమంత్రి లు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన వారు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతాన్నారు. అటువంటి వారి సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. తంగిరాల ప్రభాకర్‌రావు ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించారని నాయకులు కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీగా, అనంతరం ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించి వారి హృదయాలను గెలుచుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. ప్రత్యేకించి విద్య పట్ల ఆయనకు ఉన్న అభిమానం ఎంతో గొప్పదని, చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి తన వంతు సహాయం అందించి ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు.రాజకీయాల్లో విలువలు, ప్రజల పట్ల అంకితభావం, సేవా తత్వం కలిగిన నాయకుడిగా తంగిరాల ప్రభాకర్‌రావు చిరస్మరణీయులన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం దేవినేని వెంకటరమణ తంగిరాల ప్రభాకర్ రావులు ప్రజల హృదయాలలో నిలిచిపోతారన్నారు. పేదరికం నుంచి అంచలంచలుగా ఎదిగి, రాజకీయ రంగంలో తన సేవలతో ప్రజల హృదయాలను గెల్చుకున్న నాయకుడు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, కూటమి నేతలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దివంగత నాయకుడికి ఘనమైన నివాళులు అర్పించారు.

# ఫ్రాన్స్ అధ్యక్షుడితో ప్రధానమంత్రి అధికారిక చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 15:నీస్‌లోని విల్లా కెరిలోస్ వద్ద ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ ఏడాది ప్రారంభంలో భారత్-ఫ్రాన్స్ సంబంధాలను విశిష్టమైన అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చిన తర్వాత ఇరువురు నేతల మధ్య జరిగిన తొలి సమావేశమిది.

ద్వైపాక్షిక సంబంధాల్లోని పలు అంశాలపై ఇరుదేశాల నేతలు విస్తృత చర్చలు జరిపారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక రక్షణ సహకారం అద్భుతంగా వృద్ధి చెందటం, మరింత బలోపేతం కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రక్షణ వేదికలు, అత్యాధునిక సాంకేతికతలను సంయుక్తంగా రూపకల్పన చేయటం, అభివృద్ధి చేయటం, ఉత్పత్తి చేయటం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ఈ సహకారాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. అంతరిక్ష రంగంలో సుదీర్ఘ సహకార వారసత్వాన్ని ఇరుదేశాల నేతలు గుర్తు చేసుకున్నారు. మానవసహిత అంతరిక్ష యాత్రలు, అంతరిక్షంలోని పరిస్థితుల అవగాహనా రంగాలలో సహకారాన్ని మరింత పెంపొందించుకోవటంపై చర్చించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్య విస్తరణ మార్గాలపైనా చర్చలు జరిపారు. పౌర అణు ఇంధన రంగంలో చిన్న, అధునాతన మాడ్యులర్ రియాక్టర్లతో సహా వివిధ అంశాలపై సహకారానికి భారతదేశ శాంతి చట్టం నూతన అవకాశాలను కల్పిస్తుందన్నారు.

హారిజన్-2047 రోడ్‌మ్యాప్ ద్వారా జరిగిన పురోగతిని సమీక్షిస్తూ.. ఆర్థిక వృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలు, ప్రతిభావంతుల స్థానచలనం, ప్రజల మధ్య సంబంధాలు, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు, వైవిధ్యభరితంగా మార్చటంపై ఇరువురు నేతల ఆలోచనలను పంచుకున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో స్థిరమైన వృద్ధిని గుర్తించిన నేతలు.. అయిదేళ్లలో దీన్ని రెట్టింపు చేసేందుకు ఉన్నత స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయటానికి అంగీకారం తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్న భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎంఈ, విమానయాన, రైల్వే రంగాల్లో సహకారాన్ని పెంపొందించే మార్గాలపైనా చర్చించారు. ఏరోనాటిక్స్‌లో నైపుణ్యాభివృద్ధికి కాన్పూర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు ఒప్పందాన్ని స్వాగతించారు. ఆర్థిక భద్రతపై చర్చా వేదిక ప్రారంభాన్ని స్వాగతిస్తూ.. కీలక ఖనిజాల రంగంలో సరఫరా వ్యవస్థ స్థిరత్వాన్ని బలోపేతం చేయటానికి ఇరుదేశాల నేతలు ఆమోదం తెలిపారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో ఆవిష్కరణ, సాంకేతికతల కీలక పాత్రను గుర్తిస్తూ.. భాగస్వామ్యానికి దీర్ఘకాలిక దిశానిర్దేశం చేసేందుకు ''ఆవిష్కరణల రోడ్‌మ్యాప్ - 2030''ని ఇరుదేశాలు ఆమోదించాయి. కృత్రిమ మేధపై సహకార విస్తరణకు సంబంధించి చర్చలు జరిపారు. ఇందుకోసం సంయుక్తంగా భారత్-ఫ్రాన్స్ ఏఐ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని అంగీకరించారు. నీస్‌లో భారత్ ఇన్నోవేట్స్‌ను ఇరుదేశాల నేతలు సంయుక్తంగా ప్రారంభించటం, పారిస్‌లో జరగనున్న వివాటెక్‌లో ప్రధానమంత్రి పాల్గొననుండటం.. డీప్-టెక్, సెమీకండక్టర్లు, అగ్రి-టెక్, మెడ్-టెక్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ, అంతరిక్షం వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయి. ఫ్రాన్స్‌లో యూపీఐ నిరంతర విస్తరణను, ఇరుదేశాల ఆవిష్కరణల వ్యవస్థలలోని సంస్థల మధ్య 19 ఒప్పందాలు కుదరటాన్ని ఇరువురు నేతలు అభినందించారు.

ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఇరుదేశాల నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్రెంచ్ విమానాశ్రయాల్లో భారత పౌరులకు వీసా రహిత రవాణా సౌకర్యాన్ని వేగంగా అమల్లోకి తెచ్చినందుకుగానూ అధ్యక్షుడు మాక్రాన్‌కు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఇరుదేశాల మధ్య ప్రతిభావంతులు, విద్యార్థుల రాకపోకలను పెంపొందించే మార్గాలు, విద్యార్హతల పరస్పర గుర్తింపును విస్తరించటంపైనా చర్చించారు. నూతన విద్యా విధానం ద్వారా భారతదేశంలో క్యాంపస్‌లను ప్రారంభించాలని ఫ్రెంచ్ విశ్వవిద్యాలయాలను ప్రధానమంత్రి ఆహ్వానించారు. లోథాల్‌లోని నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌తో సహా మ్యూజియంలు, సాంస్కృతిక సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరుదేశాల నేతలు అంగీకరించారు.

పశ్చిమాసియా, ఉక్రెయిన్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత గల పలు అంశాలపై ఇరుదేశాల నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. ఎవియన్‌లో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తితో ఉన్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. ఈ సదస్సుకు ముందుగానే కీలకమైన చర్చల్లో భారత్‌ను భాగస్వామిని చేసినందుకు అధ్యక్షుడు మాక్రాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుదేశాల ప్రజలకు మరిన్ని అవకాశాలు కల్పించటంలోనూ, ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వం, సంక్షేమాన్ని పెంపొందించటంలోనూ భారత్-ఫ్రాన్స్ అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్య ప్రాముఖ్యతను ఇరుదేశాల నాయకులు స్పష్టం చేశారు.

భారత్‌లోని జైపూర్‌లో 10 రోజుల పాటు జరిగిన ఆర్ట్ రెసిడెన్సీ సమయంలో ఫ్రాన్స్ కళాకారులు థిబాల్ట్ లా లాన్స్, థియోఫిలే డి బాస్చర్ రూపొందించిన కళాఖండాలను దేశాధ్యక్షుడు మాక్రాన్, ప్రధానమంత్రి వీక్షించారు. ఈ కళాకారులు భారతీయ వారసత్వం, రమణీయత నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన కళాఖండాలు.. భారత్-ఫ్రాన్స్ దేశాల సాంస్కృతిక కలయికను ప్రతిబింబించాయి.

చర్చల అనంతరం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి గౌరవార్థంగా అధ్యక్షుడు మాక్రాన్ విందు ఏర్పాటు చేశారు.

# ప్రజాసేవకు అత్యుత్తమ వేదిక టీడీపీ

## -సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



అమరావతి, జూన్ 15:ప్రజాసేవకు అత్యుత్తమ వేదిక తెలుగుదేశం పార్టీ అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో 62, 63, 64 డివిజన్లకు చెందిన సుమారు 100 మంది యువకులు, కార్యకర్తలు ఎస్సీ నాయకుడు విజయ్ కుమార్, మైనార్టీ యువ నాయకుడు భాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ బొండా ఉమా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీ విధానాలు యువతను, వివిధ వర్గాల ప్రజలను ఆకర్షిస్తున్నాయని, ప్రజాసేవ చేయాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీ అత్యుత్తమ వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు.

రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని, యువత రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ,బుదాల సురేష్ బాబు, నందేటి ప్రేమ్, అబ్రహం,ఆకుల సూర్య ప్రకాష్,కంచేటి నాగరాజు,లక్కీశెట్టి సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

# లైన్‌మెన్ నిర్లక్ష్యంతో యువకుడికి విద్యుత్ షాక్..

## -బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తుల ధర్నా

నల్గొండ, జూన్ 15:కరెంట్ పనుల కోసం తీసుకెళ్లిన లైన్‌మెన్ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై గాయపడిన ఘటన చిట్యాల మండలంలో వెలుగులోకి వచ్చింది. ప్రమాదం జరిగి 18 రోజులు గడిచినా విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత లైన్‌మెన్ స్పందించకపోవడంతో బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

సోమవారం చిట్యాల సబ్‌స్టేషన్ వద్ద వట్టిమర్తి గ్రామస్తులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధితుడు మనోజ్ తల్లి జాల బద్రమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిమర్తి గ్రామానికి చెందిన తన కుమారుడు మనోజ్‌ను మే 30న స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేసే లైన్‌మెన్ కరెంట్ పనుల కోసం తీసుకెళ్లాడని చెప్పారు. పని సమయంలో 11 కేవీ విద్యుత్ స్తంభంపైకి మనోజ్‌ను ఎక్కించారని తెలిపారు.

అయితే అనూహ్యంగా విద్యుత్ సరఫరా కొనసాగడంతో ఇండక్షన్ ప్రభావానికి గురైన మనోజ్‌కు తీవ్ర విద్యుత్ షాక్ తగిలి, స్తంభం పై నుంచి కిందపడిపోయాడని ఆమె వివరించారు.

ఈ ప్రమాదంలో మనోజ్ రెండు కాళ్లు, చేతులు, వీపు భాగంలో తీవ్ర గాయాలకు గురయ్యాడని, పలుచోట్ల ఎముకలు విరిగిపోయాయని తెలిపారు. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ప్రస్తుతం నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

భర్త లేని తమ కుటుంబానికి మనోజ్ ఒక్కరే ఆధారమని, ఇప్పుడు అతడే వికలాంగుడిగా మారడంతో కుటుంబం తీవ్ర కష్టాల్లో పడిందని కన్నీరుమున్నీరయ్యారు.

ప్రమాదం జరిగిన తర్వాత 17 రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ లైన్‌మెన్ గానీ, విద్యుత్ శాఖ అధికారులు గానీ పరామర్శించలేదని, ఎలాంటి సహాయం అందించలేదని ఆమె ఆరోపించారు.

ప్రమాదానికి కారణమైన లైన్‌మెన్‌పై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ శాఖ నుంచి తమ కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని జాల బద్రమ్మ ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

# చేగువేరా జయంతి సందర్భంగా ఘన నివాళులు..

## -స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు

ఆదిలాబాద్, జూన్ 15: ప్రపంచ విప్లవయోధుడు ఎర్నెస్టో చేగువేరా జయంతి వేడుకలను పురస్కరించుకొని చౌటుప్పల్ పట్టణంలో జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేష్ నేతృత్వంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి



ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పైలాన్ పార్క్, తంగేడు వనంలో ప్రజలకు, వ్యాపారులకు పరమేష్ చేతుల మీదుగా చెత్తబుట్టలను పంపిణీ చేశారు. చేగువేరా జీవిత విశేషాలు, ఆయన విప్లవ భావజాలం, సామాజిక సేవా స్ఫూర్తిని వివరించే పుస్తకాలను యువతకు, స్థానిక ప్రజలకు అందజేశారు.

ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఆముదాల పరమేష్ మాట్లాడుతూ "ప్రతి అడుగు స్వచ్ఛత వైపు.. ప్రతి గడప పరిశుభ్రత వైపు.. నవ నిర్మాణమే జనసేన లక్ష్యం ? చౌటుప్పల్‌ను స్వచ్ఛంగా మారుద్దాం" అన్నారు. దేశం, జాతి, మతం అనే సరిహద్దులను దాటి మానవత్వం కోసం పోరాడిన మహనీయుడు చేగువేరా అని కొనియాడారు. ప్రపంచ యువతలో సామాజిక చైతన్యం, పోరాట స్ఫూర్తి, సేవాభావాన్ని నింపిన గొప్ప విప్లవ యోధుడని పేర్కొన్నారు. 'ప్రజల కోసం జీవించడం, అవసరమైతే ప్రజల కోసమే ప్రాణత్యాగం చేయడం' అనే సందేశాన్ని తన జీవితం ద్వారా నిరూపించిన మహోన్నత వ్యక్తి ఆయన అన్నారు.

సమాజం కోసం, దేశం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రతి జనసైనికుడు చేగువేరాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ?చేగువేరా సిద్ధాంతాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన ప్రతి యువకుడిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొల్లం మల్లేశ్, చిన్నం ప్రశాంత్, బద్రి రాజు, చిన్నం రాజీవ్, పెద్దగోని లింగస్వామి, సరికొండ సంజయ్, పాశం శ్రీనాథ్, శ్రీకాంత్, ముద్దం రాజు, గణేష్, దొడ్డి వంశీ, బాలగోని శివ, పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

# యోగాతో పాటు ఆరోగ్యంగా ఉంటూ దీర్ఘకాలం జీవించడంపై ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 15:కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

శక్తిమంతమైన దేశాన్నీ, మరింత ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశాన్నీ నిర్మించాలంటే దేశ పౌరులు వారి జీవనంలో ఏ దశలో అయినా సరే, ఆరోగ్యవంతులుగా, చురుకుగా, ఫలితాలను సాధించిపెట్టేవారుగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ వ్యాసం ముఖ్యంగా ప్రస్తావించింది. భారతదేశ ప్రాచీన జ్ఞానంలో బోధిస్తున్న ప్రకారం.. మనిషి ఆరోగ్యంగా ఉండడంలో కీలక పాత్రను పోషించే సమగ్ర విధానాన్ని యోగా అందిస్తుందనీ, మనిషి మంచి ఆరోగ్యంతో ఉంటూ దీర్ఘకాలం జీవించి ఉండేలా తోడ్పడుతుందనీ ఈ వ్యాసం స్పష్టం చేసింది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి కార్యాలయం పొందుపరుస్తూ "అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026ను పండుగలాగా జరుపుకోవడానికి ప్రపంచ దేశాలు సన్నద్ధం అవుతున్న క్రమంలో, కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ ఒక వ్యాసాన్ని రాశారు. అందులో, గొప్ప దేశాన్నీ, మరింత ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశాన్నీ నిర్మించడానికి దేశ పౌరులను వారి జీవనంలో ఏ దశలో అయినా ఆరోగ్యవంతులుగానూ, చురుకుగానూ, ఫలితాలను సాధించిపెట్టేవారుగానూ ఉండేటట్లు శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

భారతదేశ ప్రాచీన జ్ఞానంలో ప్రస్తావించిన యోగా.. మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ఒక సమగ్ర విధానాన్ని సూచిస్తూ, స్వస్థతతో దీర్ఘ కాలం జీవించడానికి మనిషికి దన్నుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు" అని తెలిపింది.

# వెల్గనూర్ ఎన్ఎంఎంఎస్ విజేతల తల్లిదండ్రులకు సన్మానం..

నల్గొండ, జూన్ 15: దండేపల్లి మండలంలోని వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నూతన విద్యా సంవత్సరం సందర్భంగా బడిలో చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. పాఠశాలలో అడుగుపెట్టిన విద్యార్థులను ఉత్సాహంగా ఆహ్వానించి, వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ లక్ష్మి మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు కావ్య, మణిదీప్‌ల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సన్మానించిందని తెలిపారు.

విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, పాఠశాల ఉపాధ్యాయులు వారికి అన్ని విధాలుగా సహకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ వజ్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హై స్కూల్‌లో టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీ..

నల్గొండ, జూన్ 15:అంవేసవి సెలవులు ముగియడంతో సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం మణికొండ జిల్లా పరిషత్ హై స్కూల్లో ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి విద్యార్థులకు టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నదని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువస్తూ, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. మొదటి రోజునే పుస్తకాల పంపిణీ జరగడం విద్యా వ్యవస్థలో ఒక మంచి ప్రారంభానికి సంకేతమని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుద్ధోలు శ్రీరాములు, డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శివగంగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత భవిష్యత్ వృద్ధికి మూలస్తంభాలుగా ఆవిర్భవిస్తున్న సైన్స్, అంకురసంస్థలు, అంతరిక్ష సాంకేతికత: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జూన్ 15:విధాన సంస్కరణలు, పెరుగుతున్న ప్రైవేట్ భాగస్వామ్యం, వేగంగా విస్తరిస్తున్న ఆవిష్కరణల వ్యవస్థ కారణంగా భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఉన్న 8-9 బిలియన్ డాలర్ల నుంచి రాబోయే దశాబ్దంలో దాదాపు 40-45 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందడానికి సిద్ధంగా ఉందని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, అణుశక్తి, అంతరిక్ష, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... భారత అంతరిక్ష రంగంలో జరుగుతున్న పరివర్తన దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పెద్ద మార్పును ప్రతిబింబిస్తోందనీ, ఈ మార్పుతో శాస్త్ర-సాంకేతికతలు ప్రయోగశాలల పరిధిని దాటి జాతీయ చైతన్యంలో భాగమయ్యాయని అన్నారు. సైన్స్, సమాజం మధ్య పెరుగుతున్న అనుబంధం ఇటీవలి సంవత్సరాల్లో సాధించిన అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒకటని ఆయన పేర్కొన్నారు. భారత శాస్త్రీయ పురోగతిలో పౌరుల భాగస్వామ్యం పెరుగుతోందనీ డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

"సామాన్య పౌరులూ ప్రస్తుతం భారత శాస్త్రీయ పురోగతితో మమేకవడం... దానిలో తమకూ భాగస్వామ్యం ఉందని భావించడం అతిపెద్ద విజయం" అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. శాస్త్రసాంకేతిక రంగానికి ప్రజల్లో ప్రాచుర్యం పెరుగుతోందని, ప్రధానమంత్రి దార్శనికతకు ఇది నిదర్శనమనీ, స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగాల ద్వారా ఈ రంగంలో తీసుకున్న కార్యక్రమాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించడం అందుకు కారణమని ఆయన అన్నారు.

స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, డిజిటల్ హెల్త్, డీప్ ఓషన్ మిషన్, గగన్‌యాన్ వంటి కార్యక్రమాలు భారత అభివృద్ధి ప్రయాణంలో విజ్ఞాన శాస్త్రం, ఆవిష్కరణలను కేంద్ర స్థానంలో నిలపడంలో ఎంతగానో సహాయపడ్డాయని ఆయన తెలిపారు. శాస్త్ర-సాంకేతిక కార్యక్రమాల్లో ప్రధాన మీడియా ఉనికి పెరగడం... శాస్త్రీయ పరిణామాల పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందనడానికి నిదర్శనమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. చంద్రయాన్-3 వంటి మిషన్లు అంతరిక్ష శాస్త్రాన్ని విస్తృత ప్రజాప్రయోజన అంశంగా మార్చాయనీ... దేశవ్యాప్తంగా పౌరుల్లో అపూర్వమైన అవగాహననూ, భాగస్వామ్యాన్నీ సృష్టించాయని ఆయన అన్నారు.

అంతరిక్షం, అణుశక్తి, అధునాతన సాంకేతికతల వంటి కీలక రంగాల్లో పెరుగుతున్న భారత్ సామర్థ్యాలు దేశ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేశాయని కేంద్ర మంత్రి అన్నారు. ఈ విజయాల ద్వారా ఏర్పడిన విశ్వాసం స్వదేశీ సాంకేతికతల విశ్వసనీయతను పెంచిందనీ, విశ్వసనీయ సాంకేతిక భాగస్వామిగా భారత్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసిందని ఆయన అన్నారు.

అధునాతన సాంకేతికతలు వ్యూహాత్మక, ఆర్థిక ఫలితాలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్న అభివృద్ధి చెందుతున్న రంగాల్లోనూ రాణించగల భారత్ సామర్థ్యాన్ని ఇటీవలి సాంకేతిక విజయాలే నిరూపించాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ సాంకేతికతలు, ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ దేశ శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యాల బలాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన జోడించారు.

అంతరిక్ష రంగంలో సంస్కరణల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ... కొన్ని సంవత్సరాల కిందట దేశంలో అంతరిక్ష రంగ అంకురసంస్థలు కొన్ని మాత్రమే ఉండేవనీ, ప్రస్తుతం 400లకు పైగా అంకురసంస్థలు క్రియాశీలంగా, వేగంగా విస్తరిస్తున్న ఈ వ్యవస్థకు తోడ్పాటునందిస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. సాపేక్షంగా తక్కువ కాలంలో సాధించిన ఈ వృద్ధి స్థాయి... భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ అపార సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోందని ఆయన అన్నారు.

చంద్రయాన్-3, రాబోయే గగన్‌యాన్ కార్యక్రమం వంటి మిషన్లలో భారత్ సాధించిన విజయాలు... దేశాన్ని ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష దేశాల సరసన నిలబెట్టాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. సంక్లిష్టమైన మిషన్లను సమర్థత, ఆవిష్కరణలు, తక్కువ ఖర్చుతో అమలు చేయగల తన సామర్థ్యాన్ని భారత్ ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తూనే ఉందని ఆయన తెలిపారు.

పరిపాలన, అభివృద్ధి కోసం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించడమే భారత్ విశిష్ట బలాల్లో ఒకటని కేంద్ర మంత్రి అన్నారు. మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల పర్యవేక్షణ, ప్రజా సేవల పంపిణీలో అంతరిక్ష ఆధారిత అనువర్తనాలను దేశం విజయవంతంగా అనుసంధానించిందనీ, ఈ స్థాయిలో అనుసంధానం అరుదుగా కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పీఎం గతి శక్తి, పట్టణాభివృద్ధి కార్యక్రమాలు, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల వంటి కార్యక్రమాలు... అభివృద్ధి ప్రాజెక్టుల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణను మెరుగుపరచడంలో... పారదర్శకతను, సామర్థ్యాన్ని పెంపొందించడంలో అంతరిక్ష సాంకేతికత ఎలా సహాయపడుతుందో తెలియజేస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

ప్రతి ప్రధాన అంతరిక్ష కార్యక్రమం నిరంతర అభ్యసనం, అభివృద్ధి ద్వారానే పరిణామం చెందుతుందని కేంద్ర మంత్రి అన్నారు. మిషన్ల సమయంలో ఎదురయ్యే సవాళ్లు సమర్థమైన వ్యవస్థలకు, మెరుగైన సంసిద్ధతకు, భవిష్యత్తులో మరింత పటిష్ఠమైన మిషన్లకూ దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

అంతరిక్ష యాత్రల్లో ఎదురయ్యే తాత్కాలిక సవాళ్లను శాస్త్రీయ పురోగతి, సాంకేతిక పరిణామాల విస్తృత నేపథ్యంలో చూడాలని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దేశ శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యాలకు ఉదాహరణలుగా... చంద్రయాన్, మార్స్ మిషన్లు తొలి ప్రయత్నంలోనే సాధించిన విజయాలను ఉటంకించారు.

అగ్రగామి అంతరిక్ష దేశాలతో పోలిస్తే భారత్ రికార్డు మొత్తంగా మెరుగ్గానే ఉందని ఆయన తెలిపారు.

ఇటీవలి పీఎస్ఎల్‌వీ మిషన్‌లో తలెత్తిన లోపంపై విశ్లేషణ పూర్తయిందనీ, దాని మూలకారణాలను గుర్తించామని కేంద్ర మంత్రి తెలిపారు. దిద్దుబాటు చర్యలు ఇప్పటికే ప్రారంభించామనీ, ఈ అనుభవాల ఆధారంగా భవిష్యత్ మిషన్లు ప్రయోజనం పొందుతాయన్నారు. తద్వారా భారత అంతరిక్ష కార్యక్రమం మరింత బలోపేతమవుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

భారత శాస్త్రీయ విజయాలు ఆర్థిక వృద్ధికి, సాంకేతిక స్వయం-సమృద్ధికి, ప్రపంచంతో పోటీపడేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అంకురసంస్థలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థల భాగస్వామ్యం... వికసిత్ భారత్-2047 దార్శనికతను ముందుకు నడిపించగల బలమైన ఆవిష్కరణల వ్యవస్థను సృష్టిస్తోందని ఆయన తెలిపారు.

"వికసిత్ భారత్-2047 కోసం ఆవిష్కరణలు, ఔత్సాహిక పరిశ్రమల ఆధారిత వృద్ధి" అనే ఇతివృత్తంతో నిర్వహించిన రైజ్ కాన్‌క్లేవ్-2026 సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆవిష్కరణల వ్యవస్థ అంతటా సహకారాన్ని బలోపేతం చేయడం... శాస్త్రీయ పరిశోధనను సామాజిక, ఆర్థిక ఫలితాలుగా మార్చడాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా నిర్వహించిన ఈ సదస్సు... పరిశోధకులు, అంకురసంస్థలు, పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలను ఒకచోట చేర్చింది. ఈ కార్యక్రమంలో 125కు పైగా అంకురసంస్థలు, సాంకేతిక ఆవిష్కర్తలు పాల్గొని... ఏరోస్పేస్ సాంకేతికతలు, కృత్రిమ మేధ, డీప్-టెక్, వ్యవసాయ సంబంధిత ఆహార ఆవిష్కరణల రంగాల్లో పరిష్కారాలను సూచిస్తూ రూపొందించిన అంశాలను ప్రదర్శించారు. పరిశోధన-పరిశ్రమ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని ముందుకు తీసుకెళ్లడంపై వారు ప్రధానంగా చర్చించారు.

# సర్కారు బడిలో విద్యార్థులకు పౌష్టికాహారం, పుస్తకాల పంపిణీ

నల్గొండ, జూన్ 15: తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' కార్యక్రమం నేడు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా, 35వ డివిజన్ , శివనగర్ లోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అల్పాహార పథకంతో పాటు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు ,నోటుబుక్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసికార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్,35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ 35వ డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ రాజేష్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడకుండా, చదువుపై పూర్తి ఏకాగ్రత చూపేలా చూడటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల శారీరక, మానసిక వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుందని, బడిలో విద్యార్థుల హాజరు శాతం కూడా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నరేంద్ర స్వామి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

మరియు

ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం

శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు

" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

ముఖ్య అతిథి : లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్

సభాధ్యక్షులు : శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త

విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ

గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం

పురస్కార గ్రహీత : శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్

ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్

ఆత్మీయ అతిథి : శ్రీమతి పొత్తూరి జయలక్ష్మీ, మేనేజర్ సాహితీ కిరణం

పురస్కార ప్రదాత : శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్

వందన సమర్పణ : శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.

# ఆరు కోట్ల మంది లఖ్‌పతి దీదీల లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా

# 700 షి-మార్టులు, 1,000 జిల్లా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు

న్యూ ఢిల్లీ, జూన్ 15:ఆరు కోట్ల మంది లఖ్‌పతి దీదీలను తీర్చిదిద్దడానికి ఒక వ్యూహాన్ని గ్రామీణ అభివృద్ధి శాఖ రూపొందించింది. ఈ వ్యూహంలో వాణిజ్య సంస్థలను ప్రోత్సహిస్తూ జీవనోపాధికి మెరుగైన అవకా శాలను కల్పించడం, గ్రామీణ మహిళలకు ఆర్థిక సేవల లభ్యతను మెరుగుపచడం, స్వయంసహాయ బృందాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల సామర్థ్యాల పెంపు, మార్కెటింగ్ కార్యకలాపాలపై శ్రద్ధ తీసుకోవడం, శిక్షణనివ్వడం, చేయూతను అందించడం భాగంగా ఉంటాయి. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహెడ్స్ మిషన్ (డీఏవై- ఎన్‌ఆర్ ఎల్‌ఎమ్)తో పాటు ఆ మిషన్‌కు చెందిన వివిధ ఉప పథకాల పురోగతిని పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి విభాగం కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సల్ అధ్యక్షతన ఓ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంయుక్త కార్యదర్శులు స్వాతి వర్మ, జయశ్రీ ఎమ్.జి.తో పాటు రూరల్ లైవ్లీహుడ్స్ డివిజన్, నేషనల్ మిషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎన్‌ఎమ్‌ఎమ్‌యు)కు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళా వస్త్రోత్పత్తుల తయారీదారులు (ప్రొడ్యూసర్లు) కేవలం బతుకుదెరువును సంపాదించుకోవడానికి పరిమితం కాకుండా వృత్తిపరమైన నైపుణ్యంతో నిర్వహించే, నిరంతర ప్రాతిపదికన వ్యవస్థాగత మార్కెట్లకు చేరుకొనగలిగిన వాణిజ్య సంస్థలకు యాజమానురాళ్లుగా ఎదగడానికి వీలు కల్పించే ఒక పటిష్ఠ, ఏకీకృత మార్కెటింగ్ విస్తారిత అనుబంధ వ్యవస్థను ఏర్పాటు చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. గ్రూపులో యాజమాన్య హక్కును కలిగి ఉండే రిటైల్ వ్యవస్థలు, ఒక యూనిఫైడ్ నేషనల్ మార్కెటింగ్ గుర్తింపు, డిజిటల్ వాణిజ్య వేదికలు, కీలక రిటైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సంస్థాగత సహాయ యంత్రాంగాలతో పాటు సంబంధిత మార్గదర్శకాలను ఆచరణ రూపం దాల్చే స్థాయిలో రూపొందించాలనే అంశాలు చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి.

ఎస్‌హెచ్‌జీ సారథ్యంలోని వాణిజ్య సంస్థలను ప్రోత్సహించడానికి 700 షి-మార్టులు, 1,000 డిస్ట్రిక్ట్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, శ్రేష్ఠతా కేంద్రాలను (సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్) ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర స్థాయిలో సమాఖ్యలను బలోపేతం చేయాలని సమావేశంలో తెలిపారు. అవకాశాలు ఎక్కువగా ఉండే వాణిజ్య ప్రాంతాల్లో షి-మార్టులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిచారు. వాటిలో ఎస్‌హెచ్‌జీ ఉత్పాదనలకు నిరంతర లభ్యతను నిర్ధారించడానికి బలమైన బ్యాక్‌వర్డ్, ఫార్వర్డ్ మార్కెట్ లింకేజీలకు ఆస్కారం ఉండాలని సూచించారు. అమలు తీరు పటిష్ఠంగా ఉండేటట్లు చూడటానికి కార్యకలాపాల వార్షిక క్యాలెండరును రూపొందించాలని కార్యదర్శి ఆదేశించారు. లక్ష్యాల వారీ కాలావధులను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. అనేక పురస్కారాలను అందిస్తూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల, కమ్యూనిటీ సంస్థల విశిష్ట సేవలను గుర్తించి, సత్కరించాలని ఆయన అన్నారు. ప్రతిపాదిత కేటగిరీల్లో.. 'అత్యుత్తమ పనితీరును కనబరిచిన రాష్ట్రం', 'అత్యుత్తమ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్త', 'అత్యుత్తమ డిజిటలీకరణ కార్యక్రమం', 'అన్నింటి కన్నా ఎక్కువ మొత్తంలో ఎస్‌హెచ్‌జీ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఘనత', 'లఖ్‌పతి దీదీ పురస్కారం'తో పాటు గ్రామీణ జీవనోపాధి విస్తారిత అనుబంధ వ్యవస్థలో శ్రేష్ఠత్వాన్ని గుర్తించే ఇతర కేటగిరీలు భాగంగా ఉన్నాయి.

వ్యవసాయేతర జీవనోపాధి మార్గాలు, మార్కెటింగ్ కార్యక్రమాలను కార్యదర్శి సమీక్షించారు. సవరించిన సరస్ మేళా మార్గదర్శకాలను రూపొందించి, జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఎస్‌హెచ్‌జీ ఉత్పాదనల విక్రయ అవకాశాలు, మార్కెట్ లభ్యతను పెంచడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో సరస్ మేళాల సంఖ్యను పెంచాలన్నారు. ప్రొడ్యూసర్ గ్రూప్ యాప్‌ను ప్రారంభించాలనీ, జన్ సమర్థ్ వెబ్‌సైట్ ద్వారా దాఖలు చేసిన రుణ దరఖాస్తుల్లో జాప్యాన్ని నివారించాలనీ ఆయన ఆదేశాలిచ్చారు. డీఏవై-ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ క్రెడిట్-లింక్‌డ్ స్కీమ్ విషయంలో బ్యాంకర్ల మధ్య అవగాహనను పెంచడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

'సరస్ ఆజీవికా' కోసం ప్రతిపాదిత యూనిఫైడ్ నేషనల్ మార్కెటింగ్ గుర్తింపునూ సమీక్షించారు. ముక్కచెక్కలుగా ఉన్న బ్రాండింగును ఏకవిధ, ప్రీమియం, సాంస్కృతికంగా జతపడిన జాతీయ బ్రాండుగా మార్చాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మెరుగైన ప్రాడక్ట్ పొజిషనింగ్, మంచి ప్యాకేజింగ్ ద్వారా మార్కెట్లో గుర్తింపును పెంచుకోవడంతో పాటు ఆయా ఉత్పాదనల కోసం శ్రమించిన చేతివృత్తి కళాకారుల, సముదాయాల కృషిని కూడా వెలుగులోకి తీవడం ఈ కార్యక్రమం ఉద్దేశాలు.

సరికొత్తగా తీర్చిదిద్దిన 'ఈ-సరస్ పోర్టల్' విషయంలో చోటుచేసుకున్న పురోగతినీ సమీక్షించారు. స్వయంసహాయ బృందాల ఉత్పాదనలకు డిజిటల్ లభ్యతను పెంచడానికి ఈ వేదికను ఒక అమ్మకందారు (సింగిల్-వెండర్) వెబ్‌సైట్‌కు బదులు, బహుళ విక్రేతల (మల్టి-వెండర్)తో కూడిన, ఓమ్ని-చానల్ మార్కెట్ ప్లేసుగా మార్పు చేర్పులు చేస్తున్నారు. దీనికి అదనంగా, న్యూఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో ఉన్న ప్రధాన 'సరస్ గ్యాలరీ'కి కొత్త రూపును ఇవ్వాలన్న ప్రణాళికలపైనా చర్చించారు. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని పంచడం, రిటైల్ పనితీరును పటిష్ఠపరచడంపై దృష్టిని కేంద్రీకరించారు.

ఉత్పాదనలకు కొత్త రూపురేఖలను కల్పించడం, డిజైన్ డెవలప్‌మెంట్, ప్యాకేజింగ్‌లో మార్పు, నాణ్యత నియమాలను పాటించడం, సామర్థ్యాల పెంపుదల కోసం నేషనల్ హబ్స్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపైనా చర్చించారు. ఈ హబ్స్ ఎస్‌హెచ్‌జీ ఉత్పాదనల పోటీతత్వాన్ని మెరుగుపరిచి, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని వాటిని తీర్చిదిద్దడంలో కీలక పాత్రను పోషిస్తాయని ఆశిస్తున్నారు.

ప్రతి ఒక్క కార్యక్రమానికీ విస్తృత కార్యనిర్వహణ సంబంధిత మార్గదర్శకాలను అందించాలన్నది సమావేశంలో కీలకాంశమైంది. ఈ మార్గదర్శకాలు రాష్ట్రాలకూ, కేంద్రపాలిత ప్రాంతాలకూ ఒక ఉమ్మడి ప్రాథమిక ప్రణాళికను, ప్రామాణిక కార్యనిర్వహణ విధివిధానాల (ఎస్ఓపీస్)ను, సుస్పష్టంగా నిర్వచించిన భూమికలను, కాలపరిమితులను, ప్రక్రియలను అందిస్తాయి. దీంతో వాటిని ప్రభావవంతంగా అమలుపరచడంతో పాటు అనుకున్న ఫలితాలను సకాలంలో రాబట్టవచ్చు. అమలు బాధ్యతను రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలూ స్వీకరిచడం, అవసరమైన వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్నీ, సహాయాన్నీ మంత్రిత్వ శాఖ అందించనుండడంతో ఈ ప్రయత్నాలు గ్రామీణ మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్కెట్ లభ్యతను చెప్పుకోదగిన స్థాయిలో బలోపేతం చేస్తాయనీ, ఎస్‌హెచ్‌జీ ఉత్పాదనలకు మంచి ధర లభించే జాతీయ, అంతరాజాతీయ మార్కెట్లలో ఆదరణ లభించేటట్లు తోడ్పాటును అందిస్తాయనీ భావిస్తున్నారు.

# కలెక్టర్ చాంబర్ ముట్టడి..

## -విద్యాశాఖ వైఫల్యంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

## -అక్రమ పాఠశాలలను వెంటనే మూసివేయాలని డిమాండ్




నిజామాబాద్, జూన్ 15:జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస యూ, డీఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల జిల్లా కమిటీలు సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌ను ముట్టడించాయి.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా అనుమతి లేని పాఠశాలల వివరాలను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన విద్యాశాఖ అధికారులే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో అనేక పాఠశాలలు అనుమతులు లేకుండానే "ప్రవేశాలు పూర్తయ్యాయి" అంటూ బోర్డులు ఏర్పాటు చేసి విద్యార్థులను ఆకర్షిస్తున్నప్పటికీ, వాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారికి వాస్తవ పరిస్థితులను తెలియజేయకుండా కొందరు మండల విద్యాశాఖ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. అనుమతి లేని పాఠశాలలను వెంటనే మూసివేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి, సంబంధిత మండల విద్యాశాఖ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్ చాంబర్ ముట్టడి సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుని బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బొడ్డు అనిల్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబోధ్, ఏఐపీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్, నాయకులు కుశాల్, రాజు, చక్రి, సునీల్, శివ, వినీత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట అభివృద్ధే లక్ష్యం..

## -ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

## -మంత్రి కోమటిరెడ్డి, సీతక్కతో ఎమ్మెల్యే వంశీకృష్ణ కీలక భేటీ

నల్గొండ, జూన్ 15:అచ్చంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ రాష్ట్ర మంత్రులతో కీలక సమావేశాలు నిర్వహించారు.

హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో రోడ్ల విస్తరణ, పెండింగ్ పనుల పూర్తి, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం.

అనంతరం ఐకేపీ పథకంలో పనిచేస్తున్న వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వంశీకృష్ణ, వీఓఏ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ప్రగతి భవన్‌లో కలిశారు.

ఈ సందర్భంగా వీఓఏలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి సీతక్క, సంబంధిత అధికారులతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వీఓఏల సంక్షేమం కోసం ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అచ్చంపేటను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ అచ్చంపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్థానికుల అభిప్రాయం ప్రకారం, నియోజకవర్గ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.

# జాతీయ రహదారుల పరివర్తన: వికసిత భారత్ దిశగా దేశ ప్రయాణానికి మరింత శక్తి

న్యూఢిల్లీ, జూన్ 15: రహదారి మౌలిక వసతుల రంగంలో గడచిన పన్నెండేళ్లలో భారత్ అపూర్వమైన మార్పులను చూసింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ మార్గదర్శకత్వంలో అనుసంధాన రంగంలో నూతన శకానికి రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంవోఆర్‌టీహెచ్) నాయకత్వం వహిస్తోంది. ఆర్థిక వృద్ధిని బలోపేతం చేస్తోంది. సరకు రవాణా సామర్థ్యాన్ని మెరుగుప రుస్తోంది. లక్షలాది ప్రజలకు ప్రయాణ సౌలభ్యాన్ని అందిస్తోంది.

జాతీయాభివృద్ధికి ప్రపంచ స్థాయి మౌలిక వసతులే కీలకమైనవిగా గుర్తించి, రవాణా సదుపాయాలను విస్తరించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, రోడ్డు భద్రతను పెంపొందించడం, సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పరివర్తనాత్మక కార్యక్రమాలను చేపట్టింది. వేగవంతమైన జాతీయ రహదారుల విస్తరణ, రికార్డు స్థాయి నిర్మాణ వేగం, ప్రతిష్ఠాత్మకమైన ఎక్స్‌ప్రెస్ వేల అభివృద్ధి కలసి భారతీయ రవాణా వ్యవస్థను పునర్నిర్మించాయి. ఆధునికమైన, స్వయం సమృద్ధ దేశానికి పునాదులను బలోపేతం చేశాయి.

భారతమాల పరియోజన: సమీకృత జాతీయ అను సంధానానికి దార్శనికత

దేశవ్యాప్తంగా సరకులు, ప్రయాణీకుల రవాణాను మెరుగుపరచడానికి రూపొందించిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన భారతమాల పరియోజన, జాతీయ రహదారి రంగంలో అత్యంత పరివర్తనాత్మక కార్యక్రమాల్లో ఒకటిగా ఉంది. సుమారు రూ. 5.35లక్షల కోట్ల అంచనా వ్యయంతో 34,800 కిలోమీటర్ల జాతీయ రహదారి కారిడార్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్న ఈ కార్యక్రమానికి 2017 అక్టోబర్‌లో భారత ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఆర్థిక కారిడార్లు, అంతర కారిడార్లు, ఫీడర్ మార్గాలు, జాతీయ కారిడార్ల సామర్థ్య పెంపు ప్రాజెక్టులు, సరిహద్దు రహదారులు, తీరప్రాంత రోడ్లు, ఓడరేవుల అనుసంధాన రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల అభివృద్ధిపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుంది. 2026, మార్చి నాటికి 26,425 కిలోమీటర్ల మేర ప్రాజెక్టులను కేటాయించగా, 22,590 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. రవాణా అనుసంధానాన్ని భారతమాల పరియోజన ప్రాజెక్టు గణనీయంగా పెంపొందించింది. సరకు రవాణా ఖర్చులను తగ్గించింది. మారుమూల, వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలకు అనుసంధానాన్ని మెరుగుపరిచింది. తద్వారా ఆర్థికాభివృద్ధికి, ప్రాంతీయ సమతుల్యతకు, జాతీయ సమైక్యతకు దోహదపడింది.

జాతీయ రహదారుల వ్యవస్థ విస్తరణ

గత దశాబ్దంలో సాధించిన అత్యంత ముఖ్యమైన మౌలిక సదుపాయాల విజయాల్లో భారతదేశ జాతీయ రహదారుల వ్యవస్థ విస్తరణ ఒకటిగా ఉంది. ఈ వ్యవస్థ 2014లో దాదాపు 91,287 కిలోమీటర్ల నుంచి ఆర్థిక సంవత్సరం 2025-26లో 1,46,572 కిలోమీటర్లకు పైగా విస్తరించాయి. ఈ వృద్ధి దాదాపు 61 శాతంగా ఉంది.

అద్భుతమైన రీతిలో సాధించిన ఈ వృద్ధి ద్వారా రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య అనుసంధానం పెరిగింది. వేగవంతమైన సరకు, సేవల రవాణాను సులభతరం చేసింది. మార్కెట్లకు రవాణా మార్గాలను విస్తరించింది. దేశ ఆర్థిక వెన్నెముకను బలోపేతం చేసింది. మారుమూల, వెనకబడిన ప్రాంతాలను వృద్ధి కేంద్రాలు, ఆర్థిక కేంద్రాలతో అనుసంధానించడం ద్వారా ప్రాంతీయ అసమానతలను పూడ్చేందుకు విస్తరించిన ఈ నెట్‌వర్కు సహకరిస్తోంది.

హైవేల నిర్మాణంలో రికార్డు స్థాయి వృద్ధి

జాతీయ రహదారుల నిర్మాణం వేగంలో కూడా భారత దేశం గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. 2013-14లో రోజుకి సుమారుగా 11.6 కి.మీ. నుంచి 2025 సంవత్సరంలో రోజుకి దాదాపు 34 కి.మీ.కు సగటు నిర్మాణ వేగం పెరిగింది.

కొనసాగుతున్న విధానపరమైన మద్దతు, మెరుగైన ప్రాజెక్టు అమలు, క్రమబద్ధీకరించిన అనుమతుల యంత్రాంగాలు, సాంకేతికపరమైన ఆవిష్కరణ, విస్తరించిన సంస్థాగత సామర్థ్యాన్ని ఈ విజయం ప్రతిబింబిస్తుంది. నిర్మాణ వేగం పెరగడం వల్ల కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడమే కాకుండా దేశవ్యాప్తంగా రవాణా సదుపాయం బలోపేతమైంది.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎంబీ) చేపట్టిన అధ్యయనం ప్రకారం జాతీయ రహదారుల అభివృద్ధి వల్ల కర్మాగారాలకు అనుసంధానం మెరుగుపడి.. సగటు సరకు రవాణా వ్యయం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఫ్యాక్టరీకీ, సరఫరాదారుడికీ మధ్య, ఫ్యాక్టరీకీ, వినియోగదారునికీ మధ్య రవాణా ఖర్చులు తగ్గాయి.

ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే: దూరప్రాంత అనుసంధానానికి సరికొత్త నిర్వచనం

భారత్ చేపడుతున్నఅత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే ఒకటి. రూ. 1 లక్ష కోట్ల వరకు అంచనా వ్యయంతో సుమారుగా 1,386 కి.మీ. పొడవుతో నిర్మించే ఈ ప్రాజెక్టు పూర్తయితే.. దేశంలోనే అత్యంత పొడవైన ప్రవేశ నియంత్రణ ఉన్న ఎక్స్‌ప్రెస్ మార్గంగా నిలవనుంది.

ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలను ఈ ఎక్స్‌ప్రెస్ మార్గం అనుసంధానిస్తుంది. ఇది దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాల మధ్య అనుసంధానాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. 2023 ఫిబ్రవరి 12న ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వేలో మొదటిగా నిర్మాణం పూర్తి చేసుకున్న 246 కి.మీ. పొడవైన ఢిల్లీ-దౌసా-లాల్‌సోట్ భాగాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. రాజస్థాన్‌లో విస్తరించిన ఈ భాగాన్ని రూ. 12,000 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించారు. దీని తర్వాత 2024 ఫిబ్రవరి 22న గుజరాత్‌లో 87కి.మీ. పొడవుతో నిర్మించిన వడోదర-భరూచ్ భాగాన్ని ప్రారంభించారు. అనంతరం, గుజరాత్‌లోనే మరో రెండు అదనపు భాగాలైన 36 కి.మీ.ల కిమ్-ఈనా, 27.5 కి.మీ.ల పొడవైన గాందేవ-ఈనా సెక్షన్లను కూడా 2026 జూన్ 5న ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందనీ, సరకు రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందనీ, ఈ కారిడార్లో పారిశ్రామిక వృద్ధినీ, పెట్టుబడులనూ, ఉద్యోగావకాశాలనూ పెంపొందిస్తుందనీ అంచనా వేస్తున్నారు.

ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్ మార్గం: ప్రాంతీయ అనుసంధాన పరివర్తన

ఢిల్లీ, మీరట్ మధ్య వేగవంతమైన, సురక్షితమైన, మరింత సమర్థమైన ప్రయాణాన్ని అందించడం ద్వారా జాతీయ రాజధాని ప్రాంతంలో రవాణా అనుసంధాన రూపురేఖలను ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్ వే మార్చివేసింది. దాదాపు 82 కి.మీ. పొడవున్న ఈ రహదారిని రూ. 8,346 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఇది ప్రయాణీకులకూ, వ్యాపారులకూ ప్రయాణ సమ యాన్ని గణనీయంగా తగ్గించింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని దశల వారీగా పూర్తి చేశారు. దీనిలోని వివిధ విభాగాలను 2018, 2021 మధ్య కాలంలో ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రహదారి పశ్చిమ ఉత్తరప్రదేశ్, జాతీయ రాజధాని ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేస్తూ, రద్దీని తగ్గిస్తూ, ప్రాంతీయాభివృద్ధికి సహకరిస్తూ.. భారత దేశంలోనే అత్యంత విజయవంతమైన పట్టణ- ప్రాంతీయ అనుసంధాన ప్రాజెక్టుల్లో ఒకటిగా ఉంది.

ద్వారక ఎక్స్‌ప్రెస్ వే: పట్టణ ప్రాంత రవాణాలో సరికొత్త ప్రమాణం

జాతీయ రాజధాని ప్రాంతంలో పట్టణ రవాణా మౌలిక వసతుల అభివృద్ధిలో కీలకమైన విజయంగా ద్వారక ఎక్స్‌ప్రెస్ వే నిలుస్తుంది. సుమారు రూ.9,000 కోట్ల వ్యయంతో దాదాపు 29 కి.మీ.ల మేర విస్తరించిన ఈ రహదారి ఢిల్లీ, గురుగ్రామ్ మధ్య అనుసంధానాన్ని గణనీయంగా మెరుగుపరిచింది.

ఈ ఎక్స్‌ప్రెస్ మార్గానికి సంబంధించిన హర్యానా విభాగాన్ని 2024 మార్చిలోనూ, ఢిల్లీ విభాగాన్ని 2025 ఆగస్టులోనూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీంతో కీలకమైన పట్టణ ప్రాంత రవాణా కారిడార్ పూర్తయింది. అధునాతన ఇంజినీరింగ్ పరిష్కారాలు, బహుళ స్థాయుల్లో ఇంటర్ ఛేంజ్‌లు, ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థలను కలిగి ఉన్న ఈ ఎక్స్‌ప్రెస్ వే రద్దీని తగ్గిస్తుందనీ, ప్రయాణ సామర్థ్యాన్ని పెంపొందిస్తుందనీ, ఈ ప్రాంతంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీరుస్తుం దని అంచనా వేస్తున్నారు.

దక్షిణ భారత దేశంలో మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ప్రధానమైనదిగా బెంగళూరు -మైసూరు ప్రాజెక్టు ఆవిర్భవించింది. 118 కి.మీ. పొడవైన ఈ ప్రాజెక్టును సుమారుగా రూ. 8,480 కోట్లతో అభివృద్ధి చేశారు. దీనిని 2023 మార్చి 12న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు.

ఈ ప్రాజెక్టు బెంగళూరు, మైసూరు మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపుగా మూడు గంటల నుంచి 75 నిమిషాలకు తగ్గించి రాకపోకలను, రహదారి భద్రతను, ప్రయాణ సౌకర్యాన్ని గణనీయంగా మెరుగుపరిచింది. అలాగే ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం, పర్యాటకాన్ని పెంపొందించడం, కొత్త అవకాశాలను కల్పించడం ద్వారా దేశంలోనే అత్యంత నాణ్యమైన రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి నమూనాగా నిలుస్తోంది.

ఢిల్లీ-డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్: అనుసంధానం, సుస్థిరత, ప్రాంతీయ వృద్ధిలో పరివర్తన

అత్యంత వేగవంతమైన, సమర్థమైన, పర్యావరణం పట్ల బాధ్యతతో కూడిన జాతీయ రహదారుల వ్యవస్థను నిర్మించడంపై భారత్ సారిస్తున్న దృష్టిని ఇంజినీరింగ్ అద్భుతమైన ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ ప్రతిబింబిస్తుంది. రూ. 12,000 కోట్ల వ్యయంతో ఈ 213 కి.మీ.ల పొడవైన రహదారిని నిర్మించారు. ఆరు లేన్లతో కూడిన ఈ ప్రవేశ నియంత్రిత కారిడార్‌ను 2026 ఏప్రిల్ 14న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఢిల్లీ, డెహ్రాడూన్ మధ్య ప్రయాణ సమయాన్ని 6 గంటల నుంచి 2.5 గంటల వరకు తగ్గించింది. ప్రయాణ దూరాన్ని 235 కి.మీ.ల నుచి 213 కి.మీ.లకు తగ్గించింది. తద్వారా ప్రయాణాలను వేగవంతంగా, ఇంధన వినియోగాన్ని తగ్గించి, సజావుగా సాగేలా చేసింది.

సుస్థిరాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ఢిల్లీ-డెహ్రాడూన్ కారిడార్‌కున్న ప్రధాన ఆకర్షణ. గణేష్‌పూర్, డెహ్రాడూన్ మధ్య ఉన్న 20 కి.మీ.ల మార్గం రాజాజీ నేషనల్ పార్కు, శివాలిక్ రిజర్వ్ అటవీ ప్రాంతం మధ్య ఉన్న పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాల మీదుగా వెళుతుంది. ఈ జీవావరణ సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని, ఆసియాలోనే అత్యంత పొడవైన ఎలివేటెడ్ వన్యప్రాణి కారిడార్లలో ఒకటైన 12 కి.మీ. మార్గాన్ని, 'దాత్-కాళి' ఆలయం సమీపంలో 370 మీటర్ల సొరంగాన్ని ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. అధునాతన ఇంజనీరింగ్‌ను పర్యావరణ సున్నితత్వంతో మేళవించి అనుసంధానాన్ని పునర్నిర్వచించడమే కాకుండా, సుస్థిర జాతీయ రహదారి అభివృద్ధికి నమూనాగా కూడా ఈ ప్రాజెక్టు నిలుస్తోంది.

గత పన్నెండేళ్లుగా రోడ్డు, జాతీయ రహదారుల రంగంలో చోటు చేసుకున్న మార్పులు "పన్నెండేళ్ల విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం" అనే స్ఫూర్తికి నిదర్శనం. కొనసాగుతున్న పెట్టుబడులు, విధానపరమైన సంస్కరణలు, వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రవాణా అనుసంధానాన్ని భారత్ బలోపేతం చేసింది. ఆర్థిక అవకాశాలను విస్తరించి, లక్షలాది పౌరుల జీవన నాణ్యతను మెరుగుపరిచింది.

# చోరీకి గురైన మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత..




వరంగల్ జూన్ 15:వరంగల్ జీఆర్‌పీ సీఐ పి. సురేందర్ సోమవారం చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు తిరిగి అప్పగించారు.

ప్రయాణికుల నుంచి పోయిన లేదా దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో గుర్తించి స్వాధీనం చేసుకుని, వాటిని బాధితులకు అందజేశారు.

స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వన్‌ప్లస్, శాంసంగ్, వివో తదితర కంపెనీలకు చెందిన ఫోన్లు ఉన్నాయని, వాటి మొత్తం విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని సీఐ పి. సురేందర్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే లేదా దొంగతనానికి గురైన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి పొందే అవకాశాలు అధికంగా ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ సూచించారు.

# సాంస్కృతిక కీర్తి కిరీటం: 75 వసంతాల సాలార్ జంగ్ మ్యూజియం ప్రస్థానం

భారతదేశ సాంస్కృతిక వైభవానికి, చారిత్రక వారసత్వానికి అద్దం పడుతూ హైదరాబాద్ మహానగర గుండెకాయ లాంటి మూసీ నది తీరాన కొలువు దీరిన అపురూప కళాఖండాల నిలయం 'సాలార్ జంగ్ మ్యూజియం' నేడు తన డెబ్బై ఐదేళ్ల వసంతాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటోంది. ఒక వ్యక్తి అసాధారణ అభిరుచి, అంకితభావం నుండి పురుడు పోసుకుని, ఒక సామ్రాజ్యపు సాంస్కృతిక వైభవాన్ని తనలో నింపుకున్న ఈ మహోన్నత సంస్థ, 1951 జూన్ 16వ తేదీన ప్రజా బాహుళ్యానికి అంకితమైంది. అప్పటి నుండి నేటి వరకు గడిచిన ముప్పావు శతాబ్ద కాలంలో ఈ మ్యూజియం ప్రపంచ పర్యాటక పటంలో భారతదేశ కీర్తి కిరీటంగా నిలిచింది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని జూన్ 14 నుండి జూన్ 21 వరకు వారం రోజుల పాటు ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక సంబరాలు, విద్యా విషయక సదస్సులు మరియు ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలతో ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి.

సాలార్ జంగ్ మ్యూజియం ప్రస్థానం కేవలం ఒక ప్రభుత్వ ప్రదర్శనశాల చరిత్ర మాత్రమే కాదు; అది కళల పట్ల ఒక మనిషికి ఉన్న అమితమైన ఆరాధనకు, ప్రపంచ వారసత్వాన్ని భావితరాల కోసం భద్రపరచాలనే మహోన్నత సంకల్పానికి సజీవ సాక్ష్యం. హైదరాబాద్ సంస్థానానికి ప్రధానమంత్రులుగా (దివాన్లుగా) సేవలందించిన సాలార్ జంగ్ కుటుంబానికి దాదాపు ఐదు శతాబ్దాల ఘనమైన చరిత్ర ఉంది. కుతుబ్‌షాహీలు, మొఘలులు, ఆసఫ్‌జాహీల కాలాల్లో ఈ కుటుంబం రాజకీయంగా, సామాజికంగా అత్యున్నత స్థానాల్లో వెలిగింది. ఈ వంశంలో మూడవ వారసుడైన నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్, సాలార్ జంగ్-III గా సుప్రసిద్ధులు. ఆయన స్వల్ప కాలం పాటు నిజాం రాజుకు ప్రధానమంత్రిగా వ్యవహరించినప్పటికీ, తదనంతరం రాజకీయ జీవితానికి దూరమై తన జీవితాన్ని, అపార సంపదను పూర్తిగా ప్రపంచవ్యాప్త కళాఖండాల సేకరణకే అంకితం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన సాగించిన ఈ అన్వేషణ ఫలితంగానే, ప్రపంచంలోనే అతిపెద్ద ఏకవ్యక్తి సేకరణగా (Single-man collection) ఈ మ్యూజియం రికార్డు సృష్టించింది.

నిజానికి 1949లో సాలార్ జంగ్-III అకస్మాత్తుగా మరణించినప్పుడు ఆయనకు వారసులు లేకపోవడంతో, ఈ అమూల్యమైన సంపదను ఏం చేయాలనే ప్రశ్న తలెత్తింది. ఆ సమయంలో భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మార్గదర్శకత్వంలో, ఈ అపురూప నిధిని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా సాలార్ జంగ్ మ్యూజియం కమిటీ ఏర్పాటైంది. తొలుత చార్మినార్ సమీపంలోని వారి పూర్వీకుల నివాసమైన 'దివాన్ దేవిడీ' ప్యాలెస్‌లోనే 1951లో ఈ ప్రదర్శనశాలను ప్రారంభించారు. కాలక్రమేణా సందర్శకుల సంఖ్య పెరగడం, భద్రతా కారణాల దృష్ట్యా 1968లో దీనిని ప్రస్తుతం మనం చూస్తున్న మూసీ నది తీరంలోని విశాలమైన సొంత భవన సముదాయంలోకి మార్చారు. 1961లో భారత పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా దీనిని 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ'గా (Institution of National Importance) గుర్తించి, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోకి తీసుకువచ్చింది. భారతదేశంలో కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియం, న్యూఢిల్లీలోని నేషనల్ మ్యూజియం సరసన నిలిచే మూడవ అత్యున్నత జాతీయ మ్యూజియం ఇదే కావడం గమనార్హం.





ఈ మ్యూజియం యొక్క అంతర్గత విస్తృతిని, దాని వైవిధ్యాన్ని పరిశీలిస్తే ఎవరికైనా మతిపోవాల్సిందే. అధికారిక గణాంకాల ప్రకారం ఇక్కడ సుమారు 49,000 కంటే ఎక్కువ కళాఖండాలు, 47,000 ముద్రిత గ్రంథాలు, మరియు దాదాపు 9,000 అరుదైన హస్తప్రతులు భద్రపరచబడి ఉన్నాయి. ఈ మ్యూజియం కేవలం భారతదేశ సంస్కృతికే పరిమితం కాలేదు. దీనిని ప్రధానంగా మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చు: భారతీయ కళలు, పాశ్చాత్య (యూరోపియన్) కళలు, మరియు ప్రాచ్య (ఆసియా, మధ్యప్రాచ్యం) దేశాల కళలు. ఒకే ప్రదేశంలో నిలబడి ప్రపంచంలోని వివిధ నాగరికతల పరిణామాన్ని, ఆయా దేశాల శిల్పకళా చాతుర్యాన్ని వీక్షించే అరుదైన అవకాశం ఇక్కడ లభిస్తుంది. ఇక్కడి గ్రంథాలయంలో ఉన్న పర్షియన్, అరబిక్, ఉర్దూ, సంస్కృత భాషల ప్రాచీన తాళపత్రాలు, గ్రంథాలు నేటికీ అంతర్జాతీయ పరిశోధకులకు ఒక అక్షయపాత్రలా ఉపయోగపడుతున్నాయి.

సాలార్ జంగ్ మ్యూజియం పేరు వినగానే ప్రపంచవ్యాప్త పర్యాటకులకు ముందుగా గుర్తొచ్చేది 'వీల్డ్ రెబెక్కా' (ది వీల్డ్ రెబెక్కా) అనే అద్భుత పాలరాతి శిల్పం. ఇటాలియన్ శిల్పి జియోవన్నీ బెంజోని 19వ శతాబ్దంలో చెక్కిన ఈ శిల్పంలో, ఒక స్త్రీ ముఖంపై ఉన్న పారదర్శకమైన ముసుగును సైతం పాలరాయిలోనే అత్యంత సహజంగా ఆవిష్కరించిన తీరు మానవ మేధస్సుకు పరాకాష్టగా నిలుస్తుంది. అలాగే, ఇక్కడి మరో ఆకర్షణ 'డబుల్ స్టాచ్యూ' (ద్విముఖ శిల్పం). దీనిని వెనుక నుండి చూస్తే ప్రార్థన చేసుకుంటున్న స్త్రీ రూపం, ముందు నుండి చూస్తే అహంకారంతో కూడిన పురుషుడి (మెఫిస్టోఫిలిస్) రూపం కనిపిస్తుంది. ఒకే చెక్క ముక్కపై రెండు పరస్పర విరుద్ధమైన భావాలను చెక్కిన ఈ శిల్పం శిల్పకళా రంగంలోనే ఒక అద్భుతం. వీటికి తోడు, ప్రతి గంటకు ఒక చిన్న బొమ్మ బయటకు వచ్చి గంట కొట్టే 19వ శతాబ్దపు ఇంగ్లాండ్ 'సంగీత గడియారం' (మ్యూజికల్ క్లాక్)ను చూడటానికి సందర్శకులు గంటల తరబడి నిరీక్షిస్తుంటారు. వీటితో పాటు మొఘల్ చక్రవర్తులు షాజహాన్, జహంగీర్ ఉపయోగించిన కత్తులు, నూర్జహాన్ దుస్తులు, జపాన్ దేశానికి చెందిన ఐవరీ (ఏనుగు దంతాల) శిల్పాలు, చైనా దేశపు అరుదైన పోర్సిలిన్ పాత్రలు ఇక్కడి గ్యాలరీలలో కొలువై ఉన్నాయి.

ప్రస్తుత ప్లాటినం జూబ్లీ మహోత్సవాల నేపథ్యంలో మ్యూజియం యాజమాన్యం కేవలం గత వైభవాన్ని చాటడానికే పరిమితం కాకుండా, రాబోయే ఏడాది పొడవునా సరికొత్త డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా నేతృత్వంలోని పాలక మండలి, మ్యూజియం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంప్రదాయ ప్రదర్శనలను డిజిటలైజ్ చేయడం, వర్చువల్ రియాలిటీ (ఎఫ్) ద్వారా అంతర్జాతీయ పర్యాటకులు సైతం ఇంట్లోనే కూర్చుని మ్యూజియంను సందర్శించేలా సాంకేతికతను అభివృద్ధి చేయడం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ప్రస్తుతం రూపుదిద్దు కుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక, సాంకేతిక సహకారంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్జర్వేషన్ లాబొరేటరీలను (కళాఖండాల సంరక్షణ ప్రయోగశాలలు) ఇక్కడ మరింత బలోపేతం చేస్తున్నారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన ప్రముఖ సాంప్రదాయ చిత్రకారుడు రుమాలె చెన్నబసవయ్య గీసిన 80కి పైగా చిత్రాల ప్రత్యేక ప్రదర్శన కళాభిమానులను విశేషంగా అలరిస్తోంది.

ఈ 21వ శతాబ్దపు ప్రపంచీకరణ వేగంలో, యాంత్రిక జీవన విధానంలో మానవుడు తన మూలాలను, సంస్కృతిని మరచిపోతున్న తరుణంలో సాలార్ జంగ్ మ్యూజియం వంటి సంస్థల ఆవశ్యకత మునుపటికంటే ఎంతైనా పెరిగింది. ఇది కేవలం పాత వస్తువులను దాచి ఉంచే ఒక నిస్తేజమైన గిడ్డంగి కాదు; ఇది గతకాలపు వైభవానికి, వర్తమాన జ్ఞానానికి మరియు భవిష్యత్ తరాల ఆలోచనలకు వంతెనలా నిలిచే ఒక జీవన పాఠశాల. గడిచిన 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో కోట్ల మంది పర్యాటకులకు, వేలాది మంది పరిశోధకులకు జ్ఞాన భిక్ష పెట్టిన ఈ కళా సామ్రాజ్యం, ఒకే ఒక్క వ్యక్తి యొక్క ఉదాత్తమైన ఆశయం సమాజానికి ఎంతటి మహోపకారాన్ని చేయగలదో నిరూపించింది.

ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న ఈ శుభసందర్భంలో, భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల శాశ్వత చిరునామాగా, విశ్వమానవ నాగరికతల సంగమ క్షేత్రంగా సాలార్ జంగ్ మ్యూజియం రాబోయే వందలాది తరాలకు నిరంతర స్ఫూర్తినిస్తూ అజేయంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# మృతురాలి భౌతిక కాయానికి నివాళులు



రాజన్న సిరిసిల్ల, జూన్ 15: (నేటి నిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గంలోని కొదుముంజ గ్రామానికి చెందిన కొమిరె లక్ష్మీ నాగవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కదిరె రాజు, కచ్చకాయల మహేష్, అరుణాద్రి, వైభవ్ తదితరులు పాల్గొని మృతురాలికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# మున్సిపల్ ఉద్యోగులపై మేయర్ ఆగ్రహం

- ప్రజాసేవలో క్రమశిక్షణ తప్పనిసరి
- మున్సిపల్ సిబ్బందికి మేయర్ ఆదేశాలు

కరీంనగర్, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి) నగరపాలక సంస్థలో సమయపాలన పాటించని ఉద్యోగులపై మేయర్



కొలగాని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, అధికారులు విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారనే సమాచారంతో సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో పలువురు ఉద్యోగులు నిర్ణీత సమయానికి కార్యాలయానికి రాకపోవడాన్ని గమనించిన మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా సమయపాలన పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు. నగరపాలక సంస్థ ద్వారా ప్రతిరోజూ ప్రజలకు అనేక సేవలు అందుతున్నాయని, ఉద్యోగులు ఆలస్యంగా రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై అనవసరంగా ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ప్రజాసేవలో క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరి ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తొలిరోజే పాఠ్యపుస్తకాల పంపిణీ..

మేడ్చల్, జూన్ 15: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం మేడ్చల్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు ద్వారా పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, మెరుగైన బోధనా పద్ధతులను ప్రవేశపెడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాల ను అధిరోహించి, సమాజానికి నిలవాలని ఆకాంక్షించారు.

# వేవ్స్ డాక్ బజార్ 2026లో ప్రదర్శించడానికి 'వేవ్స్ డాక్ బజార్ రికమెండ్స్'

న్యూఢిల్లీ, జూన్ 15:19వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) 2026 కు అనుబంధంగా జరగనున్న రెండో వేవ్స్ డాక్ బజార్ కోసం 'వేవ్స్ డాక్ బజార్ రికమెండ్స్' కార్యక్రమం కింద ఎంపికైన ప్రాజెక్టులను జాతీయ చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ (నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ - ఎన్ఎఫ్‌డీసీ) ప్రకటించింది.

ఎంఐఎఫ్ఎఫ్ మార్కెట్ విభాగాన్ని 2026 జూన్ 16 నుంచి 18 వరకు ముంబయిలోని డాక్టర్ గోపాలరావు దేశ్‌ముఖ్ మార్గ్‌లో ఉన్న ఎన్ఎఫ్‌డీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తారు. ఇది డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్, యానిమేషన్ రంగాలకు చెందిన చిత్ర దర్శకులు, నిర్మాతలు, బ్రాడ్‌కాస్టర్లు, పంపిణీదారులు, చలనచిత్రోత్సవ నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురానుంది.

వ్యూయింగ్ రూమ్, వర్క్-ఇన్-ప్రోగ్రెస్ ల్యాబ్, బిజినెస్-టు-బిజినెస్ మీటింగ్స్ వంటి కార్యక్రమాల ద్వారా భాగస్వామ్యాలు, నెట్‌వర్కింగ్, మార్కెట్ అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో కూడిన పారిశ్రామిక వేదికగా వేవ్స్ డాక్ బజార్ సేవలందిస్తుంది.

కొత్త ప్రతిభను ఆదరించడానికి, ప్రభావవంతమైన కథలను ప్రోత్సహించడానికి వేవ్స్ డాక్ బజార్ 2026లో పాల్గొనే మూడు అత్యుత్తమ ప్రాజెక్టులకు ఒక్కో దానికి మూడు లక్షల రూపాయల చొప్పున నగదు బహుమతులను ఎన్ఎఫ్‌డీసీ అందిస్తోంది. భారత్ తో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకులను ఆకట్టుకునే సామర్థ్యం ఉండి, అసాధారణమైన సృజనాత్మక దృక్పథం, బలమైన కథనం, అత్యుత్తమ కళాత్మక విలువలను ప్రదర్శించే ప్రాజెక్టులను ఈ బహుమతుల ద్వారా గుర్తిస్తారు.

'వేవ్స్ డాక్ బజార్ రికమెండ్స్' ఎంపికలో మొత్తం 12 ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో 'వర్క్-ఇన్-ప్రోగ్రెస్ ల్యాబ్' లో పాల్గొనే నాలుగు ప్రాజెక్టులు కూడా కలిసి ఉన్నాయి. డబ్ల్యూఐపీ ల్యాబ్ ద్వారా ఎంపికైన చలనచిత్ర రూపకర్తలు తమ చిత్రాల రఫ్ కట్‌లను అంతర్జాతీయ సలహాదారులు, ఎడిటర్లతో కూడిన ప్యానెల్ ముందు ప్రదర్శిస్తారు. తద్వారా వారు తమ ప్రాజెక్టులను మరింత మెరుగుపరచుకునేందుకు అవసరమైన విలువైన సూచనలు, సలహాలు, మార్గదర్శకత్వాలను పొందుతారు.

# కోతి రాంపూర్ సెక్టర్‌లో అమ్మ మాట

- అంగన్‌వాడీ బాట' ర్యాలీ అంగన్‌వాడీల్లో ప్రైవేటుకు దీటుగా, కార్పొరేట్ స్థాయి విద్య.. సిడిపిఓ కవిత..



కరీంనగర్, జూన్ 15: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతిరాంపూర్ సెక్టార్ పరిధిలోని లక్ష్మి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పునః ప్రారంభాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు మాసం గణేష్, దేవసాని సరస్వతీ సత్యనారాయణ కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సిడిపిఓ కవిత మాట్లాడుతూ, నేటి నుండి అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభమైనట్లు ప్రకటించారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని ఆమె స్పష్టం చేశారు. కేంద్రాల్లో ప్రవేశపెట్టిన కొత్త ప్రీ-స్కూల్ కరికులమ్, లభిస్తున్న మౌలిక సదుపాయాలు పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇక్కడి ప్రీ-స్కూల్ యాక్టివిటీస్ ద్వారా పిల్లల్లో మేధోశక్తి పెరగడమే కాకుండా, మంచి అలవాట్లు, తోటి పిల్లలతో కలిసిమెలిసి ఉండే గుణం అలవడుతుంది." అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న 38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి - సత్యనారాయణ, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో కొత్తగా పిల్లల నమోదు (అడ్మిషన్లు) పెంచేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి అద్భుతమైన పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విద్యారంభ సర్టిఫికెట్ల పంపిణీకార్యక్రమం ముగింపులో భాగంగా, అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలల్లో చేరడానికి సిద్ధంగా ఉన్న 5 ప్లస్ (5+) సంవత్సరాల పిల్లలకు ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా 'విద్యారంభ సర్టిఫికెట్లను' పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిడిపిఓ కవితతో పాటు, కార్పొరేటర్లు మాసం గణేష్, దేవసాని సరస్వతి - సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎన్. అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరీష్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆర్పీలు, ఏఎన్ఎం, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 119 ఫిర్యాదులు.. చట్టపరంగా న్యాయం చేస్తాం

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ

కర్నూలు, జూన్ 15: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి, చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 119 ఫిర్యాదులు అందాయి. ఉద్యోగాల పేరుతో మోసాలు, భూవివాదాలు, కుటుంబ ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీల వివాదాలు, స్థలాల కొనుగోలు వ్యవహారాల్లో మోసాలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా నమోదయ్యాయి.

గోనెగండ్ల మండలానికి చెందిన మహబూబాషా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.3.85 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫయాజ్ భాషాపై ఫిర్యాదు



చేశారు. తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన రంగమ్మ తన 2 ఎకరాల 40 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారని న్యాయం కోరారు.

కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన రాముడు ఆస్తి విషయమై కుమారుల వేధింపులపై ఫిర్యాదు చేయగా, కర్నూలు చల్లా స్ట్రీట్‌కు చెందిన ఓ మహిళ బంగారం తీసుకుని తిరిగి ఇవ్వడం లేదంటూ చర్యలు కోరారు. కోసిగి మండలం కోల్మానుపేటకు చెందిన బసప్ప ఐదేళ్ల క్రితం కొనుగోలు చేసిన పొలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఎమ్మిగనూరుకు చెందిన వీరేష్‌బాబు ప్లాట్లు విక్రయిస్తామని చెప్పి రూ.30 లక్షలు వసూలు చేసి మోసం చేశారని జయకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరగా, పెద్దకడుబూరుకు చెందిన ఉషారాణి తన తండ్రి మరణించిన తర్వాత తనకు రావాల్సిన ఆస్తిని పెదనాన్న ఇవ్వడం లేదని వినతి సమర్పించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, చట్టబద్ధంగా విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.